ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

విశాఖపట్నం


జిల్లా వార్తలు

శుక్రవారం 14 జూన్ 2024



అదిరిందయ్యా... చంద్రం

బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి



ఐదు ఫైళ్లపై సంతకాలు చేసిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

- మెగా డీఎస్సీకి పచ్చజెండా
- ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు
- పెన్షన్ ఇక నెలకు రూ.4 వేలు
- తెరుచుకోనున్న అన్న క్యాంటీన్లు
- నైపుణ్య గణన షురూ
- సర్వత్రా హర్షం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఫైలుపై తొలి సంతకం చేశారు. ముఖ్యమంత్రి పదవి చేపట్టగానే ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అన్నట్టే చేశారు. అదేవిధంగా వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అత్యంత ప్రమాదకరమైనదని, దానిని రద్దు చేస్తామన్నారు. ఆ పని కూడా చేసేశారు. రెండో సంతకం దానిపైనే చేశారు. అవ్వ, తాతలకు ప్రస్తుతం నెలకు రూ.3 వేలు వస్తున్న పెన్షన్‌ను జూలై నుంచే రూ.4 వేలు చొప్పున ఇస్తామని చెప్పారు. ఆ ఫైలుపై కూడా సంతకం చేశారు. పేదలకు నామమాత్రపు ధరకే రుచికరమైన భోజనం పెట్టే అన్న క్యాంటీన్లు మళ్లీ తెరిపిస్తామని చెప్పారు. అందుకు సంబంధించిన ఫైలుపై నాలుగో సంతకం చేశారు. నిరుద్యోగ యువత ఎంతమంది ఉన్నారో లెక్కించి, వారికి నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. దీనికోసం శిక్షణకు అర్హులైన వారిని గుర్తించే (స్కిల్ సెన్సస్) ఫైలుపై ఐదో సంతకం చేశారు. నిరుద్యోగ ఉపాధ్యాయులు, రైతులు, పెన్షనర్లు, పేదలు, నిరుద్యోగ యువతకు మేలు జరిగేలా ఒక్క గురువారమే ఐదు ఫైళ్లపై సంతకం చేసి లక్షలాది మందికి ప్రయోజనం కల్పించారు.

మెగా డీఎస్సీపై సంతకం

నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో హర్షం

రాష్ట్రవ్యాప్తంగా 16,347 పోస్టులు భర్తీ

- ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పోస్టుల ఖాళీలపై అధికారుల కసరత్తు
- రెండు, మూడు రోజుల్లో స్పష్టత



మెగా డీఎస్సీపై సంతకంపై ఆనందం వ్యక్తంచేస్తూ థ్యాంకు సీఎం సార్ ప్లకార్డుల ప్రదర్శన

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే (గురువారం) నారా చంద్రబాబునాయుడు సంతకం చేయడంతో నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో ఆనందం వెల్లివిరిసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాలుగున్నరేళ్లపాటు డీఎస్సీ ఊసే లేదు. నిరుద్యోగుల్లో అసంతృప్తిని గ్రహించి ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గత ఏడాది డిసెంబరులో టీచర్ల నియామకాలకు నోటిఫికేషన్ జారీచేసింది. అది కూడా సవ్యంగా ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబునాయుడు సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలి సంతకం మెగా డీఎస్సీపై చేశారు. రాష్ట్రం మొత్తం మీద 16,347 పోస్టులు భర్తీచేస్తామని ప్రకటించారు. అయితే ఉమ్మడి విశాఖ జిల్లాలో పోస్టులపై ఇంకా స్పష్టత రావలసి ఉంది. ఉపాధ్యాయులు, పాఠశాలల హేతుబద్ధీకరణ కోసం జారీచేసిన జీవో 117 రద్దు లేదా సవరించిన తరువాత జిల్లాలో ఖాళీలు ఎన్ని అనేది తెలుస్తుందని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. అయితే ఈ పర్యాయం జిల్లాలో పోస్టుల సంఖ్య ఎక్కువగానే ఉంటుందని ఆశాభావం వ్యక్తంచేస్తున్నాయి. ఈ ఏడాది చివరి వరకు ఏర్పడే ఖాళీలను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు టీచర్, విద్యార్థి నిష్పత్తిని సవరిస్తే నిరుద్యోగులకు మేలు జరుగుతుందని అంటున్నారు. ఎన్నికల సమయంలో మెగా డీఎస్సీ ఇస్తానని చెప్పిన చంద్రబాబునాయుడు అందుకు తగిన విధంగా ఎక్కువ పోస్టులు భర్తీ చేయబోతున్నారని సీనియర్

... మిగతా 6వ పేజీలో

నిరుద్యోగుల కుటుంబాల్లో ఆనందం

- టి.శ్రీను, నిరుద్యోగ ఉపాధ్యాయుడు



టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే మెగా డీఎస్సీపై సంతకం చేయడం చాలా సంతోషంగా ఉంది. ఉత్తరాంధ్రలో వేలాదిమంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఐదేళ్ల నుంచి ఎదురుచూస్తున్నారు. చంద్రబాబు నాయుడు ఒకేసారి 16,347 పోస్టుల భర్తీకి ఉద్దేశించిన ఫైలుపై సంతకం చేసి నిరుద్యోగుల కుటుంబాల్లో ఆనందం నింపారు.

పెన్షన్‌దారులకు పండగ



పింఛన్ రూ.3,000 నుంచి రూ.4,000కు పెంపు

- జిల్లాలో 1,63,655 మందికి లబ్ధి

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్‌ను రూ.మూడు వేల నుంచి రూ.నాలుగు వేలకు పెంచుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తమవుతోంది. రూ.200 ఉన్న పింఛన్‌ను గతంలో చంద్రబాబునాయుడే రూ.రెండు వేలు చేశారు. రెండు వేల నుంచి మూడు వేల రూపాయలు చేయడానికి జగన్ ప్రభుత్వానికి ఐదేళ్లు పట్టింది. ఈ నేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే పింఛన్‌ను రూ.4 వేలకు పెంచుతామని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. అన్నట్టుగానే ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజునే అందుకు సంబంధించిన ఫైలుపై సంతకం చేశారు.

కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విశాఖ జిల్లాలో 1,63,655 మంది పింఛన్‌దారులు లబ్ధి పొందనున్నారు. ఇప్పటివరకూ పింఛన్ల కోసం జిల్లాకు ప్రతినెలా రూ.48,64,89,500 విడుదల చేసేవారు. ప్రతి ఒక్కరికీ రూ.వెయ్యి పెంపుతో ప్రస్తుతం ఇచ్చే సొమ్ముకు అదనంగా రూ.16,36,55,000 విడుదల చేస్తారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్, మే, జూన్ నెలలకు

... మిగతా 6వ పేజీలో

చంద్రబాబు చల్లగుండాల...



చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయన మాట తప్పే మనిషి కాదు. చంద్రబాబు అంటేనే నమ్మకం. పింఛన్‌ను రూ.4,000కు పెంచుతూ సంతకం చేశారు. ఆ సొమ్ము అందుతాదని ఎదురుచూస్తున్నా. ఇచ్చిన హామీలు నెరవేర్చే ఆ బాబు చల్లగుండాల. మాలాంటి వృద్ధులకు పింఛన్ పెంపు ఆసరాగా ఉంటుంది.

- ఒమ్మి రాములమ్మ, దువ్వాడ

అన్న క్యాంటీన్‌లు సిద్ధం

టీడీపీ హయాంలో జీవీఎంసీ పరిధిలో 25 చోట్ల ఏర్పాటు

- రూ.ఐదుకే నాణ్యమైన భోజనం
- వైసీపీ అధికారంలోకి రాగానే మూసివేత
- మళ్లీ కూటమి అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్లకు పునరుజ్జీవం
- ఫైలుపై సంతకం చేసిన సీఎం చంద్రబాబు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభం కాబోతున్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లు ప్రారంభించి నామమాత్రపు ధరకే నిరుపేదలకు మూడు పూటలా నాణ్యమైన ఆహారం అందించింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్న క్యాంటీన్లను మూసివేసింది. తాజాగా కూటమి తిరిగి అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించాలని సీఎంగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజే చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారు. దీంతో జీవీఎంసీ సిబ్బంది అన్న క్యాంటీన్లలో బూజు దులిపే పనిలో పడ్డారు.



కేజీహెచ్ ఓపీ గేటు వద్ద అన్న క్యాంటీన్ లోపల శుభ్రం చేస్తున్న సిబ్బంది

పట్టణ ప్రాంతాల్లోని నిరుపేదలు, భవన నిర్మాణ కార్మికులు, తోపుడుబండ్ల వర్తకులు, యాచకులకు మూడు పూటలా నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు టీడీపీ హయాంలో 2018 జూన్ 11న అన్న క్యాంటీన్లను అన్ని పట్టణాల్లోనూ ప్రారంభించారు. అందులో భాగంగా జీవీఎంసీ పరిధిలో ఎంవీపీ కాలనీ, టర్నర్ చౌల్ట్రీ వద్ద ప్రారంభించారు. అన్న క్యాంటీన్‌కు ఆహారాన్ని సరఫరా చేసే బాధ్యతను స్థానికంగా ఒక స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. క్యాంటీన్‌లో ప్రతిరోజూ ఉదయం అల్పాహారం...మధ్యాహ్నం, రాత్రి అన్నం, పప్పు, కూర, పెరుగుతో కూడిన భోజనాన్ని ఐదేసి రూపాయలకే అందజేసేవారు. నామమాత్రపు ధరకు నాణ్యమైన ఆహారం అందజేస్తుండడంతో అనతికాలంలోనే అన్న క్యాంటీన్లు విశేష ఆదరణ పొందాయి. దీంతో దశలవారీగా విమ్స్ ఎదురుగా, ఎంవీపీ రైతుబజార్, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ప్రభుత్వ టీబీ ఆస్పత్రి, టర్నర్‌చౌల్ట్రీ, హోల్‌సేల్ ఫ్రూట్ మార్కెట్, మద్రిపాలెం, శ్రీహరిపురం, ములగాడ పంప్‌హౌస్, నమ్మిదొడ్డి, చినగంట్యాడ, చిట్టివలస, రైల్వేస్టేషన్, బాజీ జంక్షన్, పెందుర్తి, వేపగుంట, గోపాలపట్నం రైతుబజార్, కేజీహెచ్ ఓపీ గేటు, ఆరిలోవ, మారికవలస వాంబే కాలనీ, వైఎస్‌ఆర్ కాలనీ, అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రి..తదితర 25 ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లను ఏర్పాటుచేశారు. వీటన్నింటికీ పక్కాభవనాలు కట్టించి అక్కడ భోజనం చేసేవారికి సౌకర్యంగా ఉండేందుకు కుర్చీలు, టేబుళ్ల వంటి సదుపాయాలు కల్పించారు. ఒక్కో క్యాంటీన్‌లో ప్రతిరోజూ సగటున పది వేల మంది అల్పాహారం, 15 వేల మంది వరకూ మధ్యాహ్న భోజనం, పది వేల మంది వరకూ రాత్రి భోజనం చేసేవారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ అన్న క్యాంటీన్లను మూసివేయించింది. కొన్ని

... మిగతా 6వ పేజీలో

కడుపునిండా తింటాం



ట్రాలీ రిక్షా నడుపుతుంటాను. రోజంతా పనిచేస్తే రూ.50 నుంచి రూ.60 వరకు వచ్చేది. రామాటాకీస్ వద్ద అన్న క్యాంటీన్‌లో రూ.5తో కడుపు నిండా భోజనం చేసేవాడ్ని. వైసీపీ అధికారంలోకి వచ్చాక క్యాంటీన్‌లు మూసివేయడంతో భోజనానికి రూ.60 అయ్యేది. కూలీ మిగిలేది కాదు. ఒక్కో రోజు డబ్బులు లేక కడుపుమంటతో గడిపేవాడిని. అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తే ఇక నుంచి ప్రతిరోజూ కడుపునిండా తింటాం.

- చుక్కా అప్పన్న, రిక్షా కూలీ, మద్దిలపాలెం

జీవీఎంసీకి కొత్తభవనం నిర్మాణంపై సందిగ్ధం

- ఇప్పుడున్న భవనం సరిపోతుందని కూటమి నేతల భావన
- ప్రస్తుతానికి టెండర్లు పిలవకూడదని అధికారుల నిర్ణయం
- మరికొన్ని ప్రాజెక్టుల వ్యయంపై కూడా సమీక్షించే అవకాశం
- వైసీపీ నేతల ఒత్తిడితో అంచనాలను పెంచేశారని అనుమానాలు

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ప్రధాన కార్యాలయం నూతన భవన నిర్మాణంపై అధికారులు వెనకడుగు వేసినట్టు తెలిసింది. విస్కో రూ.80 కోట్లు, జీవీఎంసీ రూ.20 కోట్లు...మొత్తం రూ.100 కోట్లతో ముడసర్లోవలో కొత్త భవనం నిర్మాణానికి అధికారులు పంపిన ప్రతిపాదనకు గత వైసీపీ ప్రభుత్వం ఆమోదం తెలపడంతో టెండర్లు పిలిచేందుకు సమాయత్తమయ్యారు. ఇంతలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అయితే ఆశీల్‌మెట్ట జంక్షన్‌లో ప్రస్తుతం ఉన్న జీవీఎంసీ ప్రధాన కార్యాలయ భవనం బాగానే ఉందని, అటువంటప్పుడు రూ.వంద కోట్లు వెచ్చించి కొత్తది నిర్మించాల్సిన అవసరం ఏమొచ్చిందని అప్పట్లోనే కొందరు ప్రశ్నించారు. తాజాగా ప్రభుత్వం మారింది. నూతన భవన నిర్మాణంపై తెలుగుదేశం, జనసేన నేతలు అనవసర వ్యయం అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేయడంతో జీవీఎంసీ అధికారులు టెండర్లు పిలవకూడదని నిర్ణయించుకున్నట్టు ఇంజనీరింగ్ అధికారుల ద్వారా తెలిసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ప్రస్తుతానికి అవసరమైన పనులకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని, ఆర్భాటాల జోలికి వెళ్లకూడదని కూటమి నేతలు స్పష్టంచేసినట్టు జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు. అలాగే ఏలేరు రిజర్వాయర్ నుంచి గాజువాక సమీపంలోని కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (కేబీఆర్)కు చేరిన నీటిని భీమిలి (జోన్-1), మధురవాడ (జోన్-2) పరిధిలోని నివాసాలకు సరఫరా చేసేందుకు రూ.650 కోట్ల వ్యయంతో పైప్‌లైన్ నిర్మాణం, మధురవాడలో రూ.500 కోట్ల వ్యయంతో యూజీడీ నెట్‌వర్క్ ఏర్పాటుపై పునఃపరిశీలన చేస్తున్నారు. ఆయా ప్రాజెక్టులకు ఎంత ఖర్చు అవుతుందో విస్కో అధికారులు డీపీఆర్ తయారుచేసి గత

... మిగతా 6వ పేజీలో

విశాఖ విమల విద్యాలయం మూత

చేతులెత్తేసిన స్టీల్ ప్లాంటు యాజమాన్యం

- నిర్వాసితుల పిల్లల కోసం 1984లో ఏర్పాటు
- నిర్వహణ బాధ్యత వేరొక సంస్థకు అప్పగింత
- ఐదేళ్లకొకసారి ఒప్పందం
- తాజాగా మే 31వ తేదీతో ముగిసిన గడువు
- ఆర్థిక సాయం చేయలేమని కర్మాగారం నిస్సహాయత
- సొంతంగా నడుపుకోవాలని సూచన
- మూసివేతకు సదరు సంస్థ నిర్ణయం
- రోడ్డున పడిన 70 మంది సిబ్బంది, రెండు వేల మంది విద్యార్థులు...
- ఆందోళనకు దిగిన తల్లిదండ్రులు



విశాఖ విమల విద్యాలయం పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతోంది. ఆర్థిక ఇబ్బందుల పేరుతో వేలాది మంది పేద పిల్లలు చదువుకుంటున్న విశాఖ విమల విద్యాలయాన్ని మూసివేయాలని నిర్ణయించింది. ఈ ఆకస్మిక నిర్ణయాన్ని సిబ్బందితో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్రంగా నిరసిస్తున్నారు.

ఇదీ విద్యాలయం నేపథ్యం

స్టీల్‌ప్లాంటు నిర్మాణం కోసం 64 గ్రామాల ప్రజలు 25 వేల ఎకరాల భూములు ఇచ్చారు. వారి పిల్లల చదువుల కోసం 1984లో తెలుగు మీడియం పాఠశాలను 'విశాఖ విమల విద్యాలయం' పేరుతో ఏర్పాటుచేశారు. పాఠశాలల

... మిగతా 6వ పేజీలో

ఎస్‌డీఎఫ్ బిల్లులకు మోక్షం కలిగేనా

- టీడీపీ హయాంలో పనులు ప్రారంభం
- 2019లో పూర్తయినా బిల్లులు చెల్లించని వైసీపీ ప్రభుత్వం
- కూటమి నేతలను కలిసిన కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు
- తాజాగా బిల్లుల పెండింగ్ వివరాలపై రాష్ట్ర అధికారులు ఆరా

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇబ్బందిపడిన వారంతా ఒక్కొక్కరు బయటకు వస్తున్నారు. జీవీఎంసీ పరిధిలో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్) నిధులతో ఏటా కమ్యూనిటీహాళ్లు, రోడ్లు, కాలువలు నిర్మాణం వంటి పనులు జరుగుతుంటాయి. టీడీపీ హయాంలో 2018లో ఎస్‌డీఎఫ్ కింద రూ.38 కోట్లతో పలుచోట్ల కమ్యూనిటీ భవనాలు, రోడ్లు, కాలువలు నిర్మాణం (69 పనులు) చేపట్టారు. వాటిలో కొన్ని పనులు 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చేసరికి పూర్తయినప్పటికీ బిల్లుల చెల్లింపు మాత్రం జరగలేదు. కావాలనే నిలిపివేశారు. జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘం ప్రతినిధులు ఈ విషయమై కమిషనర్, జిల్లా కలెక్టర్‌తోపాటు రాష్ట్ర మునిసిపల్ శాఖ ఉన్నతాధికారులను కలిసి పెండింగ్ బిల్లులను చెల్లించాలంటూ వినతిపత్రాలు అందజేశారు. అయినప్పటికీ వైసీపీ పెద్దలు బిల్లులు చెల్లింపునకు సమ్మతించలేదు. దీంతో ఏడాది కిందట కొంత మంది కాంట్రాక్టర్లు కోర్టుకు వెళ్లడంతో రూ.33 కోట్లు మేర బిల్లులు చెల్లించారు. కోర్టుకు వెళ్లకుండా ఉండిపోయిన కాంట్రాక్టర్లకు మాత్రం ఇప్పటికీ బిల్లులు అందలేదు. కాంట్రాక్టర్ల సంఘం ఈ విషయాన్ని

... మిగతా 6వ పేజీలో

నేటి అర్ధరాత్రి నుంచి చేపల వేట

- ఏర్పాట్లలో మత్స్యకారులు



ఫిషింగ్ హార్బర్‌లో సిద్ధమైన బోట్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సముద్రంలో చేపల వేటకు మత్స్యకారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి వేటకు బయలుదేరి వెళ్లనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఏటా ఏప్రిల్ 15 నుంచి రెండు నెలలు వేట నిషేధిస్తుంది. ఆ గడువు శుక్రవారంతో ముగుస్తుంది. కాగా, ఈసారి సీజన్ బాగుండాలని మత్స్యకారులు గంగమ్మకు మొక్కులు సమర్పించుకుని బోట్లను సిద్ధం చేసుకుంటున్నారు. ఈ సీజన్‌లో తొలి మూడు నెలలు రొయ్యలే ఎక్కువగా పడతాయి. కొంచెం వర్షాలు పడితే సముద్రంలో చేరే కొత్తనీటికి రొయ్యలు పైకి వచ్చి వలలకు చిక్కుతాయి. వారం నుంచి రెండు వారాలు సముద్రంలో తిరిగితే తప్ప గిట్టుబాటు అయ్యే సరకు దొరకదు. సముద్రంలో రెండు వారాలు వేట సాగించాలంటే డీజిల్, ఇతర సరకులు, గ్యాస్, ఐస్ తదితరాలకు రూ.4 లక్షల వరకు వ్యయం అవుతుంది. వేట నుంచి వచ్చాక రొయ్యలు, చేపలు అమ్మగా వచ్చే మొత్తంలో పెట్టుబడి రూ.4 లక్షలు తీయగా మిగిలేదే లాభం. అందులో కూడా కలాసీలకు రెండు వారాల జీతం ఇవ్వాల్సి ఉంటుంది. అంటే వేటకు వెళితే రూ.5 లక్షల విలువైన మత్స్య సంపదతో రావాలి. అంతకంటే తక్కువ వస్తే నష్టమే. అయితే రెండు నెలలు ఎవరూ వేటకు వెళ్లకపోవడం వల్ల సముద్రంలో మత్స్య సంపద బాగానే లభిస్తుంది. దానికి కాసిన్ని వర్షాలు కురిస్తే పంట పండినట్టే.

విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో 650కి పైగానే మెకనైజ్డ్ బోట్లు ఉన్నాయి. వీటిలో 150 వరకు వేటకు వెళ్లడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. వాటికి దొరికే వేట, ఎగుమతిదారులు నిర్ణయించే రేటు చూసుకొని మిగిలిన వారంతా వెళతారని మత్స్యకార సంఘ నాయకుడు ఒకరు తెలిపారు. వేటకు వెళ్లేవారికి ప్రభుత్వం రాయితీ ధరతో డీజిల్ అందిస్తోంది. ఒక్కో బోటుకు నెలకు మూడు వేల లీటర్లు ఇస్తారు. ప్రస్తుతం నెల మధ్య నుంచి వేట మొదలవుతుండడంతో బోటుకు 1,500 లీటర్లే ఇస్తారు. బయట డీజిల్ ధర రూ.100 ఉండగా, హార్బరులో రాయితీపై రూ.91కి ఇస్తున్నారు. రాయితీ తీసుకునేవారు వేట సమయంలో ప్రతి నెలా కనీసం రెండు వేల లీటర్లు కొనుగోలు చేయాలి. అయితే కాకినాడ నుంచి వచ్చే బయో డీజిల్ లీటరు రూ.85కే లభిస్తుండడంతో అంతా దానిని వాడుతున్నారు. హార్బర్ బంకులో ఎవరూ కొనడం లేదు. అలాంటి వారి జాబితా తయారుచేసి, వారికి రాయితీ ఇవ్వబోమని అధికారులు స్పష్టంచేయడంతో మత్స్యకారులు ఉసూరుమంటున్నారు. ఏదేమైనా ముందు వేటకు వెళ్లడానికి అంతా సన్నద్ధమవుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, జూన్ 13: నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు. నరసింహనగర్, రైతుబజారు ఏరియాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

17నుంచి విశ్వేశ్వర స్వామి కల్యాణోత్సవాలు

మహారాణిపేట, జూన్ 13: మహారాణిపేట పరిధిలోని శ్రీవిశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవాలను ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ మేనేజర్ అడపా దేవుళ్ళు తెలిపారు. ఈనెల 23 వరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 17న మండపారాధన, త్రిశూలపూజ, స్వామి కల్యాణం జరుగుతుందని, 18 నుంచి ప్రత్యేక హోమాలు నిర్వహిస్తామని ఆయన వివరించారు.

సెయింట్ అంథోని చర్చి ఉత్సవాలు

మహారాణిపేట: స్థానిక పునీత్ సెయింట్ అంథోని చర్చి మహోత్సవాలు గురువారం జరిగాయి. విద్యార్థులకు నిర్వహించిన పోటీల విజేతలకు ఫాదర్ డి.బాలశౌరి బహుమతులు అందజేశారు.








టీఎస్సార్ కాంప్లెక్స్ వద్ద భారీ గోతులతో నిండిపోయిన రహదారి


కృష్ణాగార్డెన్స్ కాలువపై శిథిలమైన సిమెంట్ పలకలు

ప్రధాన రహదారుల్లో ప్రమాదకర ప్రయాణం

- ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో అధ్వానంగా రోడ్లు
- గోతులతో నిత్యం ప్రమాదాలు

డాబాగార్డెన్స్, జూన్ 13: జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని పలు ప్రాంతాల్లో రహదారులపై రాకపోకలు సాగించాలంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ బస్టాండ్ ఎదురుగా టీఎస్సార్ కాంప్లెక్స్ వద్ద రోడ్డులో సగానికి పైగా కోతకు గురైంది. దీంతో అటు వెళ్లే వాహనదారులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. కృష్ణాగార్డెన్స్‌లోని రహదారులు ఛిద్రమై అధ్వాన స్థితిలో ఉన్నాయి. రాత్రి వేళలో ఇటుగా రాకపోకలు సాగించే వారి వాహనాలు గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే రహదారుల దుస్థితికి కారణమని స్థానికులు వాపోతున్నారు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా పనిచేయాలి: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖపట్నం, జూన్ 13: విద్యార్థుల బంగారు భవిష్యత్తే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించుకొని, ఆ దిశగా పనిచేయాలని , వారి అభ్యున్నతి కోసం ప్రత్యేక సమయం కేటాయించి ఉత్తమ సేవలందించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సాంఘిక, బీసీ సంక్షేమశాఖ అధికారులను ఆదేశించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలు, వసతి గృహాల్లో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్యంపై దృష్టిసారించాలన్నారు. విద్యా సంవత్సరంలో చేపట్టాల్సిన పనులు, రూపొందించాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. రూ.11కోట్లతో 29 వసతిగృహాల ఆధునికీకరణ పనులు చేపట్టామన్నారు. శాశ్వత తాగునీటి సదుపాయం కల్పించేలా వాటర్ ప్యూరిఫైడ్ ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. క్రీడా పరికరాలు అందిస్తామన్నారు. విశాఖ విద్యా వసతి వికాసం పేరుతో చేపట్టిన అన్ని పనుల ప్రగతిని వివరించారు. సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు రామారావు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులను పీపీటీ ద్వారా వివరించారు. బీసీ వెల్ఫేర్ అధికారిణి శ్రీదేవి, డీఈవో చంద్రకళ, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్లు ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్


ఎస్ఈ సత్యనారాయణరాజుకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే

డాబాగార్డెన్స్, జూన్ 13: నియోజకవర్గంలోని సమస్యలన్నింటినీ పరిష్కరించడమే ధ్యేయమని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం డాబాగార్డెన్స్ కృష్ణాగార్డెన్స్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్యేకు తమ ప్రాంతంలోని సమస్యలను వివరించారు. వాటిపై స్పందించిన వంశీకృష్ణ సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గం చూపించాలని ఆదేశించారు. కాలుష్య సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు వీలుగా ఎస్ఈ సత్యనారాయణరాజుకు పలు సూచనలిచ్చారు.


తోటగరువు జిల్లా పరిషత్ పాఠశాలకు వెళుతున్న విద్యార్థినులు


విద్యార్థుల హాజరు తీసుకుంటున్న ఉపాధ్యాయిని


ప్రార్థన చేస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు

పాఠశాలలు పునః ప్రారంభం

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభించారు. ఉదయమే పిల్లలంతా పాఠశాలలకు బ్యాగులు తీసుకుని హాజరయ్యారు. తరగతులకు అనుగుణంగా పాఠశాలలను సిద్ధం చేశారు. కొన్నిచోట్ల ఎక్కువ మంది పిల్లలు, మరికొన్ని చోట్ల తక్కువగా హాజరయ్యారు. విద్యార్థులు రావడంతో పాఠశాల ఆవరణలు సందడిగా మారాయి. అయితే ప్రభుత్వం అందజేసిన స్టూడెంట్ కిట్లు అక్కడక్కడా పంపిణీచేయగా మిగిలిన చోట్ల ఒకట్రెండు రోజుల్లో అందజేయనున్నారు. కొన్నిచోట్ల పిల్లలకు ఇబ్బంది లేకుండా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.

రాష్ట్రంలో స్వర్ణ యుగం ఆరంభం : భీమిలి ఎమ్మెల్యే గంటా

సిరిపురం, జూన్ 13: రాష్ట్రంలో స్వర్ణ శకం ఆరంభమైందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రజలకు బంగారు భవిష్యత్తు ఇచ్చే చంద్రబాబునాయుడు పాలన మొదలైందన్నారు. ఐదేళ్లగా అదిగో డీఎస్సీ, ఇదిగో డీఎస్సీ అంటూ మాటలతో ఊదరకొట్టి నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తించిన వైసీపీ పాలన ముగిసి చంద్రన్న పాలన రావడంతో ఉద్యోగాల వెల్లువ మొదలైందన్నారు. నిరుద్యోగుల ఐదేళ్ల కష్టాలు తీరేలా ఏకంగా 16,347 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి యువతకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. అలాగే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, రూ. 4 వేలకు పింఛన్ పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణన ఫైళ్లపై సంతకాలు చేసి చంద్రబాబు మార్క్ పాలనకు శ్రీకారం చుట్టారన్నారు.

చంద్రబాబు పాలనలోనే అభివృద్ధి

మహారాణిపేట: చంద్రబాబు పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి పథాన నడుస్తుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకుడు కర్రి వేణుమాధవ్ అన్నారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మెగా డీఎస్సీ, అన్నక్యాంటీన్లు తదితర అతి ముఖ్యమైన ఐదు ఫైళ్లపై సంతకం చేయడం హర్షించదగ్గ పరిణామమన్నారు. రానున్న కాలంలో రాష్ట్రం ప్రగతిపథంలో పయనించబోతోందనడానికి ఇవి ఉదాహరణలన్నారు. వైసీపీ పాలనలో గాడి తప్పిన అన్ని వ్యవస్థలను తిరిగి నిలబెట్టే సత్తా ఉన్న నేత చంద్రబాబు మాత్రమేనన్నారు.

45వ వార్డులో సంబరాలు

అక్కయ్యపాలెం: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా 45వ వార్డు టీడీపీ అధ్యక్షుడు భరణికాన రాజు నరసింహనగర్‌లో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. చంద్రన్న పాలనలో ప్రజలు రానున్న సుఖశాంతులతో జీవిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

విశాఖ-కడప రైళ్ల నంబర్లు మార్పు

విజయవాడ: బెజవాడ డివిజన్ పరిధిలోని పలు రైళ్ళ నెంబర్లను రైల్వే అధికారులు మార్చారు. వచ్చే నెల జూలై 1 నుంచి పలు రైళ్ళ నెంబర్లు మారతాయి. ఈ మేరకు ఐఆర్‌సీటీసీ రిజర్వేషన్ పోర్టల్‌లో కూడా రైల్వే అధికారులు మార్పులు, చేర్పులు చేస్తున్నారు. విశాఖపట్నం - కడప మధ్యన నడిచే రైలు నెంబర్ ప్రస్తుతం 17488 గా ఉంది. ఇక మీదట ఈ రైలు నెంబర్ 18521 గా ఉంటుంది. అలాగే కడప - విశాఖపట్నం మధ్యన నడిచే రైలు నెంబర్ 17487ను 18522గా మార్చారు.

చైల్డ్‌వెల్ఫేర్‌కు యువకుడి అప్పగింత

సీతంపేట, జూన్ 13: నిరాదరణకు గురైన యువకుడ్ని ద్వారకా పోలీసులు చైల్డ్‌వెల్ఫేర్‌కి అప్పగించారు. మధురానగర్‌కు చెందిన ఒమ్మి ఉమేష్‌కుమార్ తండ్రి వదిలి వెళ్లిపోయాడు. స్థానికులు అతడిని ద్వారకా పోలీసుస్టేషన్‌కి తీసుకువచ్చారు. దీంతో ఆరిలోవలో గల చైల్డ్‌వెల్ఫేర్‌కు అప్పగించినట్టు ఎస్ఐ రత్నం తెలిపారు.

మెగా డీఎస్సీపై నిరుద్యోగుల హర్షాతిరేకాలు

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించిన తరువాత మెగా డీఎస్సీపై తొలి సంతకం చేయడాన్ని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో నిరుద్యోగ ఉపాధ్యాయులు స్వాగతించారు. ఈ మేరకు గురువారం వారంతా థ్యాంక్యూ సీఎంసార్ అంటూ ప్లకార్డులతో సంబరాలు జరుపుకున్నారు. పౌరగ్రంథాలయం ఆవరణలో ప్లకార్డులు పట్టుకుని ధన్యవాదాలు తెలిపారు.

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకం

పూర్ణామార్కెట్, జూన్ 13: వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గురువారం త్రికాల పంచామృతాభిషేక సేవలను నిర్వహించారు. ఉదయం 8 గంటల సమయంలో జరిగిన ప్రత్యేక పూజలో 20 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేకం, జలాభిషేకంతో పూజలు జరిగాయి.

మాది కూల్చివేతల ప్రభుత్వం కాదు

- నీటి వివాదాలపై ఒడిశాతో చర్చించి పరిష్కారం
- ఫ్రీహోల్డ్ అనుమతులపై విచారణ
- విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు


సమావేశంలో మాట్లాడుతున్న విజయనగరం ఎంపీ అప్పలనాయుడు

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు హయాంలో కూల్చివేతలు ఉండవని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల పిల్లలకు ఇచ్చే బ్యాగులపై మాజీ సీఎం జగన్ ఫొటో ఉన్నా పంపిణీ చేయాలని చంద్రబాబు ఆదేశించారన్నారు. ఆయన ముందుచూపుతో వ్యవహరిస్తారనడానికి ఇదో ఉదాహరణ అన్నారు. ఆదాయ మార్గాల పెంపు, వాటిని జాగ్రత్తగా ఖర్చుచేయడం ఆయనకు మాత్రమే తెలుసునన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ప్రచార ప్రభుత్వం కాదన్నారు. వైసీపీ హయాంలో ఆస్తులు కూల్చడం చూశామని, ఇక నుంచి ఆస్తులు కాపాడం చూస్తామన్నారు. సామాజిక న్యాయం పాటించే మంత్రిపదవులు ఇచ్చారన్నారు. ఎన్నికల్లో టిక్కెట్ల కేటాయింపు, మంత్రి పదవుల్లో ఉత్తరాంధ్రకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. రాష్ట్రంలో వైసీపీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని మాజీ సీఎం జగన్ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఈనెల 27 నుంచి ప్రజల్లోకి వస్తామని జగన్ ప్రకటనను స్వాగతిస్తూ, ప్రజాస్వామ్యంలో విపక్షం తన వంతు పాత్ర పోషించాలన్నారు. నాగావళి, వంశధార, జంఝావతి నీటి ప్రాజెక్టులు, సరిహద్దులపై ఒడిశాతో ఉన్న వివాదాల పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు. విజయనగరం జిల్లా భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ, కొత్తవలస మండలాల్లో భారీగా డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీచేయించిన కీలక నేతల విచారణ జరుపుతామన్నారు. రుషికొండలో భవనం ప్రజాప్రయోజనాల కోసం వినియోగిస్తామన్నారు. సమావేశంలో పొలమరశెట్టి శ్రీనివాసరావు, కె.గోపాలరెడ్డి పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు నజీర్ శుభాకాంక్షలు


చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నజీర్

మహారాణిపేట, జూన్ 13: రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబు నాయుడుకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ శుభాకాంక్షలు తెలియజేశారు. అమరావతిలో ని ముఖ్యమంత్రి కార్యాలయంలో గురువారం చంద్రబాబును కలిసి మైనారిటీ విభాగం తరఫున శాలువాకప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మెగా డీఎస్సీపై సంతకం

... 5వ పేజీ తరువాయి

టీచర్ ఒకరు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర విభజన తరువాత రెండు పర్యాయాలు డీఎస్సీలు నిర్వహించారు. అయితే ఇప్పుడు ప్రకటించినన్ని పోస్టులు గతంలో ఎన్నడూ భర్తీచేయలేదని నిరుద్యోగులు అంటున్నారు. ఐదేళ్ల నుంచి అనేక పోరాటాలు చేసినా జగన్ ప్రభుత్వం కనీసం స్పందించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం చంద్రబాబునాయుడు సంతకం చేసిన నేపథ్యంలో త్వరలోనే డీఎస్సీ ప్రకటన వెలువడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

జీవితాల్లో వెలుగులు నింపారు

ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు, వారాహి యాత్రలో పవన్‌కల్యాణ్‌లు నిరుద్యోగ ఉపాధ్యాయులకు డీఎస్సీపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. సంస్కరణల పేరిట ఉన్న పోస్టులను రద్దు చేసి జగన్ ప్రభుత్వం నిరుద్యోగులతో చెలగాటమాడింది. దీనికి భిన్నంగా మెగా డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పినట్టుగానే సంతకం చేసి మా జీవితాల్లో వెలుగులు నింపారు. వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలి. - **కె.జాన్సీరామ్, నిరుద్యోగ ఉపాధ్యాయుడు**

పెన్షన్‌దారులకు పండగ

... 5వ పేజీ తరువాయి

సంబంధించి నెలకు రూ.1000 చొప్పున మూడు వేలు, పెంచిన రూ.నాలుగు వేలు మొత్తం జూలైలో ప్రతి పింఛన్‌దారుకి రూ.ఏడు వేలు అందనున్నది. మూడు నెలలకుగాను వెయ్యి వంతున జిల్లాలో పింఛన్‌దారులకు రూ.49,09,65,000లు విడుదల చేస్తారు. మొత్తం చూస్తే రూ.114,11,09,500 విడుదలకానున్నాయి. విశాఖ జిల్లాలో మొత్తం 1,65,432 మందికి 16 రకాల పింఛన్లు కింద రూ.49,95,02500 అందజేస్తున్నారు. అయితే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోకి వచ్చిన పింఛన్లు 1,740, సైనిక వెల్ఫేర్ పింఛన్లు 34, భూమి లేని పేదలు ముగ్గురు వెరసి 1,777 మందికి రూ.ఐదు వేల నుంచి రూ.10 వేల పింఛన్ ఇస్తున్నారు. వీరిని మినహాయించగా 1,63,655 మందికి ప్రస్తుతం ప్రతి నెలా రూ. మూడు వేల పింఛన్ అందుతుంది. వీరిలో వృద్ధులు 74,198 మంది, వితంతువులు 54,565 మంది, విభిన్న ప్రతిభావంతులు 21,660 మంది ఉండగా, మిగిలినవారు ఇతర కేటగిరీలు ఉన్నారు. అయితే ప్రతి నెల జిల్లాలో పింఛన్ తీసుకునేవారి సంఖ్య స్వల్పంగా మారుతుందని అధికారులు చెబుతున్నారు. తాజా నిర్ణయంతో జిల్లాలో 1,63,655 మందికి ప్రయోజనం లభిస్తోందని పేర్కొన్నారు.

అన్న క్యాంటీన్‌లు సిద్ధం

... 5వ పేజీ తరువాయి

భవనాలను వార్డు సచివాలయాలకు వినియోగిస్తే చాలాభవనాలు నిరుపయోగంగా ఉండిపోయాయి. తాజాగా కూటమి అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్లను తిరిగి అందుబాటులో ఉంచాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజే (గురువారమే) అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించే ఫైలుపై సంతకం చేశారు. అన్న క్యాంటీన్ భవనాలు ఇప్పుడు ఏ స్థితిలో ఉన్నాయనేదానితో పాటు వాటిని శుభ్రం చేసిన తర్వాత తీసిన ఫొటోలను సీఎం కార్యాలయానికి పంపించాలంటూ జీవీఎంసీ యూసీడీ అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో సిబ్బంది గురువారం యుద్ధప్రాతిపదికన అన్న క్యాంటీన్లను శుభ్రం చేసి ఫొటోలను ఉన్నతాధికారులకు పంపించారు. అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్ణయంపై నిరుపేదలు, దినసరి కూలీలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

విశాఖ విమల విద్యాలయం మూత

... 5వ పేజీ తరువాయి

నిర్వహణను క్రిస్టియన్ సంస్థలు బాగా చేయగలవని విశ్వసించి మహారాణిపేటకు చెందిన 'ది వైజాగపటం డయసీస్ కార్పొరేటషన్ ప్రైవేటు లిమిటెడ్' సంస్థకు అప్పగించారు. వీరితో ఐదేళ్లకు ఒకసారి అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకొని నిర్వహణకు అవసరమైన ఆర్థిక సాయం చేస్తున్నారు. ఉక్కు టౌన్‌షిప్‌లోని ఆరో సెక్టార్‌లో పది ఎకరాల విస్తీర్ణంలో ఈ పాఠశాల నిర్మాణానికి, మౌలిక వసతుల కల్పనకు స్టీల్‌ప్లాంటే నిధులు ఇచ్చింది. సిబ్బంది జీతభత్యాలు, తదితరాలకు ఐదేళ్లకు రూ.7 కోట్ల వరకూ సాయం చేస్తోంది. ఈ వైపు నుంచి సాయం అందుతున్నందున డయాసిస్ సంస్థ నామమాత్రపు ఫీజుతో విద్యార్థులకు విద్యా బోధన చేస్తోంది. దాంతో ఆదరణ పెరిగింది. ప్రస్తుతం రెండు వేల మంది పిల్లలు ఇక్కడ చదువుతున్నారు. పిల్లలు ఎక్కువ మంది వస్తున్నారని బాలచెరువు రోడ్డులో మరో పాఠశాల ఏర్పాటుచేయగా వేయి మంది వరకు చదువుతున్నారు. దానికి కూడా ఐదేళ్లకొకసారి ఎంఓయూ చేసుకుంటున్నారు.

మే 31తో ముగిసిన ఎంఓయూ

డయాసిస్‌తో 2019లో చేసుకున్న ఐదేళ్ల ఒప్పందం ఈ ఏడాది మే 31తో ముగిసిపోయింది. దాంతో స్టీల్ యాజమాన్యం డయాసిస్ ప్రతినిధులను పిలిచి మాట్లాడింది. ప్లాంటు ఆర్థిక స్థితి బాగా లేనందున ఇకపై ఆర్థిక సాయం చేయలేమని, సొంతంగా విద్యాలయాన్ని నడుపుకోవాలని స్పష్టంచేసింది. ఈ అంశాన్ని వెంటనే సిబ్బందికి తెలియజేయాల్సిన డయాసిస్ బృందం, బుధవారం చావు కబురు చల్లగా చెప్పింది. 'విద్యాలయాన్ని మూసివేస్తున్నామని, రేపటి నుంచి రావలసిన అవసరం లేదు' అని వెల్లడించింది. దాంతో వారంతా ఉక్కు కార్మిక సంఘ నాయకులను కలిశారు. వేసవి సెలవుల జీతం రావాలంటే...విద్యా సంవత్సరం ప్రారంభం రోజున పాఠశాలకు వెళ్లి రిజిస్టర్‌లో సంతకం చేయాల్సి ఉంటుందని, అందుకోసం గురువారం వెళ్లగా, తమను అనుమతించలేదని ఉపాధ్యాయులు ఆరోపించారు. ఈ విషయాలు ఏవీ తెలియని పిల్లలు యథాప్రకారం పాఠశాలకు రాగా గేట్లు తీయలేదు. ఈ సమాచారం తెలిసి తల్లిదండ్రులు వచ్చి ఆందోళనకు తెర తీశారు.

పుస్తకాలు, యూనిఫామ్ కొనిపించారు

స్టీల్‌ప్లాంటుతో ఎంఓయూ పునరుద్ధరణ కాలేదని తెలిసినా డయాసిస్ ఆ విషయం బయట పెట్టకుండా రెండు వేల మంది పిల్లలతో కొత్త తరగతుల పుస్తకాలను పాఠశాల ఆవరణలోనే కొనిపించింది. కొత్త యూనిఫాంలు కూడా విక్రయించింది. అంతేకాకుండా ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి వరకు సుమారు 100 మందికి కొత్తగా అడ్మిషన్లు ఇచ్చింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలావుండగా బాల చెరువు రోడ్డులోని పాఠశాల మాత్రం యథావిధిగా కొనసాగుతోంది. వారి ఎంఓయూ 2027 వరకు ఉందని సమాచారం.

సొంతంగా నడుపుకోవాలని సూచించాం: విశాఖ ఉక్కు

విద్యాలయం వివాదంపై స్టీల్‌ప్లాంటు యాజమాన్యం స్పందించింది. మూసివేస్తున్నామనేది వాస్తవం కాదని తెలిపింది. ఆర్థిక ఇబ్బందుల వల్ల సాయం చేయలేమని చెప్పామని, సొంతంగా నడుపుకోవాలని, ఆ మేరకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించామని యాజమాన్యం వెల్లడించింది.

కొనసాగేలా చూస్తాం

విశాఖ విమల విద్యాలయం సమస్యను పరిష్కరిస్తాం. స్టీల్‌ప్లాంటు ఎందరికో సామాజిక బాధ్యత కింద ఆర్థిక సాయం చేస్తోంది. ఈ ప్రాంతం పిల్లల చదువుకు తప్పకుండా సాయం అందించాలి. యాజమాన్యంతో మాట్లాడి విద్యాలయం కొనసాగేలా చేస్తాం. - **పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే, గాజువాక**

జీవీఎంసీకి కొత్తభవనం నిర్మాణంపై సందిగ్ధం

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వం కూడా సమ్మతించింది. అయితే ఆయా ప్రాజెక్టులకు అంచనాలను భారీగా పెంచేశారని, దీనివెనుక వైసీపీ నేతల ఒత్తిడి ఉందని కూటమి నేతలు అనుమానిస్తుండడంతోనే వాటిని తాత్కాలికంగా నిలుపు చేయాలని అధికారులను ఆదేశించినట్టు జీవీఎంసీలో ప్రచారం జరుగుతోంది.

ఎస్‌డీఎఫ్ బిల్లులకు మోక్షం కలిగేనా

... 5వ పేజీ తరువాయి

కూటమి నేతల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు రాష్ట్ర మునిసిపల్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడారు. పనులు పూర్తిచేసి ఆరున్నరేళ్లవుతున్నాసరే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోతే ఎలాగని ప్రశ్నించినట్టు తెలిసింది. మునిసిపల్ శాఖ అధికారులు దీనిపై జీవీఎంసీ అధికారులను ఆరా తీయగా ఎస్‌డీఎఫ్ పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల వివరాలను పంపించినట్టు తెలిసింది.

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, KOVI PARWATHI (Old Name), W/o. Kovi Raghavendra Rao, resident of F.No.312, 1-1, Sri Satya Residency, Koppaka, Anakapalli. Change my name from KOVI PARWATHI (Old Name) to KOVI PARVATHI (New Name). Hence forth I am being called as KOVI PARVATHI (New Name), W/o. Kovi Raghavendra Rao for all purposes.

AJV_192951

CHANGE OF NAME

★ I, GUBBALA CHINA SATYAVATHI (Old Name), W/o. Gubbala Sri Rama, resident of 7-201, Narasimharao Peta, Jinnuru, Poduru, West Godavari Dist. Change my name from GUBBALA CHINA SATYAVATHI (Old Name) to GUBBALA SATYAVATHI (New Name). Hence forth I am being called as GUBBALA SATYAVATHI (New Name), W/o. Gubbala Sri Rama for all purposes.

AJV_192952

DISTANCE EDUCATION

★ ఫెయిల్ అయిన విద్యార్థులు డిగ్రీ పాస్ గ్యారెంటీతో కంప్లీట్ చేయుటకు అవకాశం కలదు. B.Tech., Degree, Diploma, MBA etc. Ph: 7997296796

AJV_183391

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176, 9966165093



శ్రీవారి ఆకృతిలో స్వామివారికి నివేదించిన పులిహోర

వేంకటేశ్వరస్వామికి తిరుప్పావడ సేవ

అక్కిరెడ్డిపాలెం, జూన్ 13: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో గురువారం నిర్వహించిన తిరుప్పావడ సేవ భక్తులను అమితంగా ఆకట్టుకుంది. ప్రధాన అర్చకులు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేదపండితులు వేంకటేశ్వరస్వామిని పంచామృతాలతో అభిషేకించాక కనకాంబరాలు, ప్రత్యేక నగలతో అలంకరించారు. సుమారు 30 కిలోల పులిహోరను శ్రీవారి ముందు స్వామివారి ఆకృతిలో అమర్చి, దానిపై పువ్వులు, పండ్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు స్వామివారి నేత్ర దరశనం, నిజరూప దర్శన భాగ్యాన్ని కల్పించి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో శుక్రవారం నుంచి ఐదు రోజుల పాటు వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం స్వామివారి పంచామృత అభిషేకాలతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఎస్టీబీఎల్ చైర్మన్ గుత్తికొండ బాలాజీ వీరభద్రరావు ఆధ్వర్యంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా పాలక మండలి సభ్యులు కోరారు.

వైభవంగా ముత్యమాంబ పండుగ

పెందుర్తి, జూన్ 13: మండలంలోని సరిపల్లి గ్రామస్థుల ఆరాధ్య దేవత ముత్యమాంబ పండుగను గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి పసుపు కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. బాణసంచా కాల్పుల మధ్య అమ్మవారి ఘటాలను ఊరేగించి అనుపోత్సవాన్ని చేపట్టారు. కోలాటాలు, సాము గారిడీ, కర్రసాము, తదితర వేషధారులు చూపరులను మంత్రముగ్ధుల్ని చేశారు.

సత్యసాయి సేవకుల అన్నదానం

వేపగుంట, జూన్ 13: కృష్ణరాయపురం సత్యసాయి భజన మండలి, సింహాచలం సమితి ఆధ్వర్యంలో గురువారం పాదచారులకు సత్యసాయి సేవకులు అన్నదానం చేశారు. వేపగుంట నుంచి చీమలాపల్లి వెళ్లే పాదచారులు సుమారు 150 మందికి అన్నదానం చేపట్టారు. తమ సమితి ఆధ్వర్యంలో ప్రతి గురువారం అన్నదానం చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్లు అక్కునాయుడు, కె.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి సాయం

అగనంపూడి, జూన్ 13: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడకకు చెందిన నిరుపేద విద్యార్థిని జి.రాణికి సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త పట్టా రామ అప్పారావు రూ.ఐదు వేలు విలువ చేసే పాఠ్య, నోటు పుస్తకాలను అందజేశారు. విశాఖ విమల విద్యాలయంలో చదువున్న రాణికి తల్లి కష్టపడి పని చేస్తే తప్ప ఇల్లు గడవని పరిస్థితి నెలకొనడంతో రామ అప్పారావు ఆ విద్యార్థినికి సాయం చేశారు.

సినిమా గైడ్

- **మహరాజ :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
- **మ్యూజిక్ షాపు మూర్తి:** రమాదేవి, విశేష్ (గాజువాక)
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **సత్యభామ :** సంగం, శ్రీకన్య (గాజువాక)
- **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి :** వెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **గం గం గణేశా :** వెంకటేశ్వర, శ్రీకన్య (గాజువాక)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 50, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 36, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 46, బీరకాయలు 48, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 42, క్యాబేజీ 24, క్యారెట్ 30, దొండకాయలు 28, బంగాళదుంపలు 28, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 170, మునక్కాడలు (కిలో) 60, బరబాటి 60, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 124, పొటల్స్ 34, కీరదోస 28, క్యాప్సికమ్ 72, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 125
ఫారం ధర	-- 150
విత్ స్కిన్	-- 260
స్కిన్‌లెస్	-- 270



ఎమ్మెల్యే పంచకర్లను దుశ్శాలువాతో సత్కరిస్తున్న నేతలు, కార్యకర్తలు



రమేశ్‌బాబుకు జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళలు

ఘనంగా పంచకర్ల జన్మదిన వేడుకలు

పెందుర్తి/వేపగుంట, జూన్ 13: పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులు, పంచకర్ల సేన సంయుక్త ఆధ్వర్యంలో వేపగుంట సమీపంలోని మీనాక్షి కన్వెన్షన్‌లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జన సైనికులు భారీ కేక్‌ను పంచకర్లతో కట్ చేయించాక పార్టీ శ్రేణులు ఆయనను గజమాలతో సత్కరించి, ప్రత్యేక గీతంతో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని పెందుర్తి, సబ్బవరం, పరవాడ, పెదగంట్యాడ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి పంచకర్లకు పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జనసేన వార్డు అధ్యక్షుడు డీబీఎల్ నాయుడు, నాయకులు సేనాపతి సోమశేఖర్ నాయుడు, పిన్నింటి పార్వతి, ఒబ్బిన జనార్దన్ శ్రీకాంత్, తామాడ ఆదిబాబు, కంచిపాటి మధు, మజ్జి సూరిబాబు, తనకాల శ్రీనివాస్, తదితరులు పంచకర్లను గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పంచకర్ల సేన నాయకులు ముదునూరి రాజా సుధాకర్, అయిత సింహాచలం, ముక్క కనకారావు, పిళ్లా జగన్మోహనపాత్రుడు రమేశ్‌బాబు గజమాలతో సత్కరించి, దుశ్శాలువా కల్పి జ్ఞాపికను అందజేశారు. విశాఖ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వేగి దివాకర్, టీడీపీ జిల్లా యువజన అధ్యక్షుడు పీబీఎస్ఎన్ రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కరక దేవుడు, క్లస్టర్ అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావు, నాయకులు దాట్ల మధు, సుఖవాసి అజయ్, మాజీ జెడ్పీటీసీలు రెడ్డి నారాయణ రావు, పైల జగన్నాథం, తదితరులతో పాటు పలువురు పోలీసు, వివిధ శాఖల అధికారులు రమేశ్‌బాబుకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మెగా రక్తదానం శిబిరం

ఎమ్మెల్యే పంచకర్ల జన్మదినాన్ని పురస్కరించుకుని పంచకర్ల సేన ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు. వేలాది మంది తరలిరావడంతో మీనాక్షి కన్వెన్షన్ హాల్ కిక్కిరిసిపోయింది.

వెంకటాద్రిపై పూజలు

వెంకటాద్రి శిఖరంపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని పంచకర్ల రమేశ్‌బాబు సతీసమేతంగా సందర్శించి శ్రీవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ సంప్రదాయ ప్రకారం పంచకర్లకు పూర్ణకుంభంతో స్వాగతించి ఘన సత్కారం చేశారు. ముదునూరి రాజా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

ప్రత్యేక నిధులతో చెరువుల అభివృద్ధి

భూగర్భ జలాలను పెంచడమే ప్రధాన లక్ష్యం

గాజువాక, పరిసర మండలాల్లో 91 చెరువులు ఉన్నట్టు గుర్తించిన అధికారులు



అభివృద్ధికి ఆమడ దూరంగా ఉన్న కర్ణవానిపాలెంలోని చెరువు

గాజువాక, జూన్ 13: భూగర్భ జలాలు అడుగడుతుండడంతో ప్రతి సంవత్సరం వేసవిలో తీవ్ర తాగునీటి సమస్య తలెత్తుతుంది. ఈ నేపథ్యంలో భూగర్భ జలాలు పెంపులో భాగంగా ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేసేందుకు నిర్ణయించారు. ఈ క్రమంలో గాజువాక నియోజకవర్గంతో పాటు పరిసర మండలాల్లో సుమారు 28 గ్రామాల్లో 91 చెరువులు (వాటర్ బాడీ) ఉన్నట్లు గాజువాక జోనల్ టౌన్ ప్లానింగ్ ప్రత్యేక బృందాలు సర్వే చేసి గుర్తించాయి. వీటిలో అధిక శాతం చెరువులు మట్టితో పేరుకుపోవడంతో నీరు నిల్వ లేకుండా పోతుంది. మరికొన్ని చెరువుల్లో మట్టి తవ్వి లోతు పెంచాల్సి ఉందని ఈ బృందాలు గుర్తించాయి. ఈ చెరువుల అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. సర్వేయర్‌లతో పాటు సచివాలయ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పర్యవేక్షణలో చెరువుల స్వరూపాన్ని బట్టి ఎంతమేరకు నిధులు వెచ్చించి అభివృద్ధి చేయాలన్న దానిపై అంచనాలు రూపొందిస్తున్నారు.

ఈ చెరువులన్నింటినీ లోతుగా తవ్వడం వల్ల వర్షా కాలంలో నీరంతా ఆయా చెరువుల్లోకి చేరుతుందని అధికారులు అంచనా వేశారు. చెరువుల్లో నీరు ఉండడం వల్ల పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పుష్కలంగా ఉంటాయి. తద్వారా నీటి సమస్య పెద్దగా ఏర్పడదు. వాస్తవానికి ఈ వేసవి కాలంలో గాజువాకతో పాటు పరిసర గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో మోటార్లు, బోర్లలో నీరు వచ్చే అవకాశం లేకుండా పోయింది. దీంతో ఆయా ప్రాంతాలకు జీవీఎంసీ నుంచి ట్యాంకర్‌ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. కాగా చెరువులన్నింటినీ అభివృద్ధి చేస్తే తాగునీటి సమస్యతో పాటు పంట పొలాలకు నీరు అందుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదేవిధంగా చెరువులను పూర్తి స్థాయిలో తవ్వకాలు జరిపాక ఇన్, అవుట్‌లెట్‌లను ఏర్పాటు చేసి నీరు నిల్వ ఉండేలా అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు.

గంగవరం పోర్టు కార్మికులు ప్రశాంత జీవనాన్ని కొనసాగించాలి

సీపీ రవిశంకర్ అయ్యన్నార్

పెదగంట్యాడ, జూన్ 13: గంగవరం పోర్టు ఆర్అండ్ఆర్ కార్మికులు ప్రశాంత జీవనాన్ని కొనసాగించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అయ్యన్నార్ ఆకాంక్షించారు. అదానీ గంగవరం పోర్టు ఆర్ అండ్ ఆర్ కార్మికులు గురువారం రాత్రి పెదగంట్యాడ పారిశ్రామికవాడ ఆడిటోరియంలో నిర్వహించిన సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గంగవరం పోర్టు కార్మికులకు పోర్టు యాజమాన్యం ఇచ్చిన ప్యాకేజీ మొత్తాన్ని తమ అభివృద్ధికి వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఆర్అండ్ఆర్ కార్మికులు సీపీకి వల, చేప, తదితరమైన వాటిని అందజేసి దుశ్శాలువాతో సంప్రదాయబద్ధంగా సత్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, డీసీపీ సత్తిబాబు, ఏసీపీ మోజెస్‌పాల్, గంగవరం పోర్టు సీఈవో అమిత్ మాలి, న్యూపోర్టు సీఐ దాలిబాబు, తదితరులు పాల్గొన్నారు.





సీపీ రవిశంకర్‌ను సత్కరిస్తున్న గంగవరం పోర్టు ఆర్అండ్ఆర్ కార్మికులు.. పక్కన వారు బహూకరించిన వల, చేపతో సీపీ



మృతులకు నివాళులర్పిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్, తదితరులు

ఉక్కు ప్రమాద మృతులకు నివాళి

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 13: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్‌షాప్ (ఎస్ఎంఎస్)-2 విభాగంలో 2012 జూన్ 13న జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఉద్యోగులు, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులకు మంగళవారం ఉక్కు అధికారుల సంఘం, పలు కార్మిక సంఘాల నాయకులు, వివిధ విభాగాల్లో అధికారులు, కార్మికులు నివాళులర్పించారు. మృతి చెందిన అధికారులకు సంతాప సూచకంగా సీ-భవన్‌లో రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని అంజలి ఘటించారు. కార్యక్రమంలో ఉక్కు సీఎండీ అతుల్‌భట్ పాల్గొని మృతులకు నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించాక మొక్కలు నాటారు. డైరెక్టర్లు బాగ్చి, ప్రసాద్, గణేశ్, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ హనీఫ్, అధికారుల సంఘం ప్రతినిధులు కె.చంద్రరావు, కేవీడీ ప్రసాద్, చంద్ర వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ట్రైనింగ్ సెంటర్ వద్ద గుర్తింపు యూనియన్ ఆధ్వర్యంలో మృతులకు అంజలి ఘటించగా, నాయకులు డి.ఆదినారాయణ, కేఎస్ఎన్ రావు, జె.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నేతలు జె.అయోధ్యరాం, వైటీ దాసు, యు.రామస్వామి, వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో జరిగిన వై.మస్తానప్ప, తదితర నాయకులు పాల్గొన్నారు.

అగనంపూడి: ఉక్కు ఎస్ఎంఎస్-2లో 13 ఏళ్ల కిందట జరిగిన ప్రమాదంలో మృతి చెందిన అరపాడ డేవిడ్‌కు స్థానిక అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉక్కు స్మృతి దివాస్ కార్యక్రమంలో భాగంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ డేవిడ్ సైట్ ఇంజనీర్‌గా పనిచేస్తూ దుర్ఘటనలో మృతి చెందడం ఎంతో బాధాకరమన్నారు. కార్యక్రమంలో బి.సత్యనారాయణ, గంట్ల రామారావు, జెర్రిపోతుల రమణ, గోకాడ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావుకు నివాళి

పెదగంట్యాడ, జూన్ 13: ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావుకు టీడీపీ పెదగంట్యాడ నాయకులు గురువారం నివాళులర్పించారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పులి వెంకటరమణారెడ్డి, పి.సోమునాయుడు, నమ్మి అప్పారావు, ఎం.పెంటయ్య శ్రీరామరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, జూన్ 12: విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను గురువారం రైల్వే పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ.47,500 విలువ చేసే 9.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న సమయంలో వెస్ట్‌బెంగాల్, ముషిదాబాద్‌కు చెందిన జులు రెహ్మాన్, రాజన్ థండర్ గంజాయితో పట్టుబడ్డారని తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచామని పేర్కొన్నారు.



ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తున్న రామ్‌చరణ్

కైలాసగిరిపై రామ్‌చరణ్ సినిమా షూటింగ్

విశాలాక్షినగర్, జూన్ 13: రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న గేమ్ ఛేంజర్ సినిమా షూటింగ్ గురువారం ఉదయం కైలాసగిరిపై జరిగింది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎస్.శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్ఎస్ తమన్ సంగీతం సమకూరుస్తున్నారు. షూటింగ్‌లో భాగంగా కొండ శివారులో హీరో రామ్‌చరణ్, హీరోయిన్ కియారా అద్వాణీపై కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. షూటింగ్ అనంతరం రామ్‌చరణ్ నొవాటెల్‌కు వెళ్లారు. నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో షూటింగ్ జరగనున్నట్టు చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

విశాఖపట్నం, జూన్ 13: పీఎంపాలెం పోలీస్ స్టేషన్ పరిధి మారికివలస రాజీవ్ గృహకల్ప కాలనీలో ధర్మారావు (60) అనే వృద్ధుడు ఇంటి టెర్రస్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం.. మారికివలస రాజీవ్ గృహకల్ప కాలనీలోని 100 నంబరు బ్లాకులో తాడుతూరి ధర్మారావు, భార్య సత్యవతితో కలిసి ఉంటున్నాడు. అతని కుమారుడు కూడా ఇదే కాలనీలో నివసిస్తున్నాడు. వారి స్వస్థలం విజయనగరం జిల్లా మెంటాడ. ధర్మారావు కొంతకాలంగా మానసిక సమస్యతో నగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురువారం ఉదయం అతన్ని చికిత్సకు తీసుకెళ్లడానికి కుటుంబ సభ్యులు సిద్ధం చేస్తుండగా అకస్మాత్తుగా టెర్రస్ పైకెక్కి అక్కడ నుంచి దూకడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పీఎంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు

చకచకా యారాడ రోడ్డు విస్తరణ పనులు

మల్కాపురం/సింధియా, జూన్ 13: యారాడ కొండపై రహదారి నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ మార్గంలో ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు వాహనాలు, ద్విచక్ర వాహనాలు అధిక సంఖ్యలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. అందువల్ల ఒక్కోసారి ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే ఇబ్బందులు తలెత్తడం, ట్రాఫిక్ స్తంభించడం వంటి ఘటనలు చోటుచేసుకునేవి. ఈ సమస్యను గుర్తించిన కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఈ రోడ్డును విస్తరించాలని కోరుతూ జీవీఎంసీ అధికారులకు విన్నవించారు. అందుకు స్పందించిన అధికారులు యారాడ రహదారిని విస్తరించేందుకు చర్యలు చేపట్టడంతో ప్రస్తుతం పనులు చకచకా సాగుతున్నాయి. ప్రస్తుతం రాడర్ కేంద్రం వద్ద రహదారిని విస్తరిస్తున్నారు. ఇకపై ఈ మార్గంలో వాహనదారులు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా ఉండేలా రోడ్డును వెడల్పు చేస్తున్నారు. దాదాపుగా పనులు తుది దశకు చేరుకున్నాయి. యారాడ రహదారిని విస్తరించడం పట్ల గ్రామస్థులతో పాటు వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కోన తాతారావు జన్మదిన వేడుకలు



కోన తాతారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జనసేన పార్టీ వీర మహిళలు

పెదగంట్యాడ, జూన్ 13: జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు జన్మదిన వేడుకలను గురువారం 55వ వార్డు పరిధి ముసలినాయుడుపాలెంలోని ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీకి సంబంధించిన పలువురు వీర మహిళలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలపడంతో పాటు కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో వీర మహిళలు ఎం.షాలిని, ఎల్.మురళీదేవి, పి.రామలక్ష్మి, దాసరి జ్యోతిరెడ్డి, ఇందిరా ప్రియదర్శని, జనసేన నాయకులు సీహెచ్ ముసలయ్య, ఎస్.భాస్కర్, జి.సోమశేఖర్, ఎస్.కనకరాజు, డి.త్రినాథ్, ఆర్.గోవిందరావు, జి.గోపీచంద్, సీహెచ్ చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులను ఆదుకోవాలి

అక్కిరెడ్డిపాలెం, జూన్ 13: నిరుపేద విద్యార్థులను ఆదుకునేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని విశాఖ కారుణ్య స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకురాలు మల్లెపూల నిర్మలాకుమారి అన్నారు. షీలానగర్‌లో గురువారం జరిగిన సంస్థ కార్యక్రమంలో ఇంటర్‌లో చేరిన పేద విద్యార్థి మణికంఠకు రూ.ఐదు వేలు, అనారోగ్యంతో బాధ పడుతున్న ల్యాబ్ టెక్నీషియన్ అప్పారావుకు రూ.ఐదువేలను సంస్థ సభ్యులు అందజేశారు. సభ్యులు రమేశ్‌బాబు, నిర్మల, వినోద్, సువర్ణ, విజయ, సుమతి, తదితరులు పాల్గొన్నారు.

వీవీవీ స్కూల్ యథావిధిగా నడిచేలా చూడాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 13: స్టీల్‌ప్లాంటులో గల వీవీవీ స్కూల్‌ను యథావిధిగా నడిపేందుకు కృషి చేయలని కోరుతూ బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్‌కు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది గురువారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాజువాక ప్రాంతానికే ప్రాధాన్యం కలిగిన పాఠశాలను యథావిధిగా ఉంచేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో మాట్లాడతామని, విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూస్తామన్నారు.

ఉక్కు యాజమాన్యానికి..

స్టీల్‌ప్లాంట్ వీవీవీ స్కూల్‌ను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు యు.రామస్వామి, వైటీ దాసు ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఉక్కు యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. ఉన్నట్టుండి పాఠశాలను మూసివేయడంతో సుమారు రెండు వేల మంది చిన్నారులతో పాటు సిబ్బంది కూడా ఇబ్బందులను ఎదుర్కొనవలసిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు.

ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్
ఎం.వి.పి. కోలనీ బ్రాంచి, విశాఖపట్నం. ఫోన్ : 0891-2788478

సీల్డ్ టెండర్లు మరియు వేలం

SARFAESI చట్టంలోని సెక్షన్13(2) క్రింద బ్యాంక్ అధీకృత అధికారి డిమాండ్ నోటీసులను తే 13-01-2022 న రూ. 6,57,801/- (అక్షరములా ఆరు లక్షల యాభై ఏడు వేల ఎనిమిది వందల ఒక్క రూపాయి మాత్రమే) తేది 31-12-2021 నాటికి దర్మిలా వడ్డీ మరియు ఖర్చులతో చెల్లించవలసినదిగా 1) శ్రీమతి మరబాడి సూకాలమ్మ (మరణించారు), W/o. (లేటు) సన్యాసి, 2) శ్రీ మరబాడి రాము, S/o. (లేటు) సన్యాసి, 3) శ్రీ మరబాడి వెంకటేష్, S/o. (లేటు) సన్యాసి, 4) శ్రీ మరబాడి సూకరాజు, S/o. (లేటు) సన్యాసి (వ. నెం. 2 నుండి 4 వరకు ఉన్న సభ్యులు వ. నెం. 1 కి చట్టబద్ద వారసులు మరియు హామీదారులు) వారికి నోటీసులు ఇచ్చియున్నారు. మరియు SARFAESI చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద తే 20-07-2022 దీన ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్, ఎం.వి.పి. కోలనీ బ్రాంచి, విశాఖపట్నం వారికి తనఖా పెట్టిన ఈ దిగువ సుదహరించిన స్థిరాస్తిని SARFAESI చట్టం సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలు వినియోగించుకుంటూ స్వాధీనం చేసుకున్నారు. మరియు "ఎక్కడ వున్నది అక్కడ, ఎలా వున్నది అలాగ" వేలం వేయుటకు ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, ఎం.వి.పి. కోలనీ బ్రాంచి, విశాఖపట్నం, ఫోన్ నెం. 0891-2788478 వద్ద **తేది 18-07-2024 ఉదయం 10-00 గంటలకు** సీల్డ్ టెండరు మరియు బహిరంగ వేలం ద్వారా అమ్ముటకు ఈ దిగువ సంతకం చేసిన అధీకృత అధికారి నిర్ణయించినారు.

సీల్డు టెండర్లు ఓపెన్ చేయు తేది : 18-07-2024 గురువారం ఉదయం 10-00 గంటలకు
సీల్డు టెండర్లు మరియు వేలం వేయు స్థలం : ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, ఎం.వి.పి. కోలనీ బ్రాంచి, విశాఖపట్నం

తనఖా ఆస్థి వివరములు	బకాయి మొత్తం 30-04-2024 తేది నాటికి	రిజర్వు ధర రూ.	బయానా రూ. (EMD 10%)
జి.వి.యం.సి., విశాఖపట్నం, సర్వే నెం. 382, వార్డు నెం. 17 గాగల విశాఖపట్నం, వాల్తేరు వార్డు, చినవాల్తేరు, మధుర వీధి దగ్గరలోని డోర్ నెం. 6-15-30గాగల గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ & అసంపూర్తిగా ఉన్న 2వ అంతస్తుగాగల ఆర్.సి.సి. స్లాబ్ బిల్డింగ్ ఇల్లు.	8,30,773/-	21,90,210/-	2,19,021/-

హద్దులు : తూర్పు : "సి" షెడ్యూల్డ్ ఆస్తి (ఎం. చిన సన్యాసిరావు), దక్షిణం : మున్సిపల్ మురుగుకాలువ, పడమర : 2 అడుగుల వెడల్పు ఉమ్మడి నడక దారి, ఉత్తరం : ఉమ్మడి నడక దారి **మొత్తం విస్తీర్ణం : 34.25 చ॥గజములు**

నియమ నిబంధనలు :

1. వేలంలో పాల్గొనేందుకు కాగోరు బిడ్డర్లు తిరిగి చెల్లించబడే డిపాజిట్ (EMD) ను **ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, ఎం.వి.పి. కోలనీ బ్రాంచి, విశాఖపట్నం** పేరున చెల్లించబడేలా పే-ఆర్డర్/ డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించాలి. కృతార్థులైన బిడ్డర్ల విషయంలో సదరు డిపాజిట్ సర్దుబాటు చేయబడును. అధీకృత అధికారిచే వేలం అమ్మకం నిర్వహించబడును. కాగోరు బిడ్డర్లు పే-ఆర్డర్ / డిమాండ్ డ్రాఫ్ట్‌తో సహా బిడ్‌ను సీల్డ్ కవర్‌లో ఉంచి తేది 16-07-2024 సాయంత్రం 6-00 గంటలలోగా పైన తెలిపిన బ్రాంచి నందు దాఖలు చేయాలి.
2. బయానా కోసం పే-ఆర్డర్/ డి.డి. లేకుండా దాఖలు చేసిన బిడ్ ఖచ్చితంగా తిరస్కరించబడును.
3. ఎట్టి కారణాలు తెలియజేయకుండా ఏదైనా లేదా అన్ని బిడ్లను / ఆఫర్లను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు లేదా వేలం అమ్మకమును వాయిదా వేయుటకు / పోస్ట్‌పోన్ చేయుటకు, / రద్దు చేయుటకు అధీకృత అధికారికి హక్కు కలదు. బిడ్లు తిరస్కరించబడితే, ప్రైవేటు ఒప్పందం ద్వారా ఆస్తుల అమ్మకం కోసం ఏ టెండర్దారులతోనైనా లేదా కాగోరు బిడ్డర్లతో నైనా లేదా ఇతర పార్టీలతోనైనా అధీకృత అధికారి సంప్రదింపులు జరిపి ఆస్తిని అమ్మకము చేయవచ్చును.
4. అత్యధిక బిడ్డరుకు ఆస్తిని విక్రయించబడును.
5. పైన పేర్కొన్న ఆస్తిని తెలియజేసిన రిజర్వు ధర కంటే తక్కువగా విక్రయించబడదు.
6. బిడ్/ ఆఫరు అధీకృత అధికారిచే అంగీకరించబడితే, బిడ్‌లో అత్యధిక అమ్మకం ధర ఆఫర్ చేసిన కృతార్థుడైన బిడ్డరు అమ్మకం ధరలో బిడ్ మొత్తం (బయానాతో సహా) లో 25% మొత్తమును వెంటనే అదే రోజున అధీకృత అధికారికి చెల్లించాలి. ఆ విధంగా చేయడంలో విఫలమైతే, బయానా మొత్తం తిరిగి చెల్లించబడదు. మరియు ఆస్తి తిరిగి విక్రయించబడును.
7. కృతార్థుడైన బిడ్డరు అమ్మకం నిర్ధారించబడిన 15వ రోజులోగా లేదా అంతకంటే ముందుగా బిడ్ మొత్తంలో మిగిలిన 75% మొత్తమును పే-ఆర్డర్/డిడి/ క్యాష్ రూపములో **ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, ఎం.వి.పి. కోలనీ బ్రాంచి, విశాఖపట్నంలో** చెల్లించవచ్చును. బిడ్ మొత్తంలోని మిగిలిన 75% మొత్తం నిర్దిష్ట గడువులోగా అనగా అమ్మకం నిర్ధారించబడిన తేది నుండి 15 రోజులలోగా చెల్లింపు జరపకపోతే డిపాజిట్ మొత్తం (బయానాతో సహా బిడ్ మొత్తంలో 25%) తిరిగి చెల్లించబడదు. మరియు ఆస్తి తిరిగి విక్రయించబడును. మరియు డిఫాల్ట్ అయిన కొనుగోలుదారు తదుపరి విక్రయించబడే ఆస్తి లేదా అందులోని ఏ భాగం పైన నైనా అన్ని క్లెయిమ్‌లు కోల్పోతారు.
8. బ్యాంక్‌చే అమ్మకం నిర్ధారించబడిన మీదట మరియు చెల్లింపు నిబంధనలు పాటించినట్లయితే, అమ్మకం అధికారాలు వినియోగించుకునే అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ చట్టం 2002 క్రింద గల నియమాల ప్రకారం కొనుగోలుదారుని పేరున అమ్మకపు సర్టిఫికెట్ జారీ చేస్తారు.
9. ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ ఆ విధంగానే మరియు ఉన్నవి ఉన్నట్లుగానే" స్థితిలో మరియు సెక్యూరిటైజేషన్ చట్టం 2002లో నిర్దేశించిన నిబంధనలకు లోబడి విక్రయించబడును.
10. ఆసక్తిగల పార్టీలు/ బిడ్డర్లు వేలం అమ్మకం కోసం ఉంచబడిన ఆస్తిని బ్రాంచి పనిచేయబడిన సమయంలో బ్రాంచి మేనేజర్ అనుమతితో తనిఖీ చేసుకోవచ్చును. వాటి కోసం వారు బ్రాంచి మేనేజర్ **ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, ఎం.వి.పి. కోలనీ బ్రాంచి, విశాఖపట్నం** వారిని సంప్రదించవచ్చును.
11. కృతార్థుడైన బిడ్డరు వర్తించు విధంగా / చెల్లించతగు కన్వేయన్స్, రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీ, పన్నులు, చట్టబద్ధమైన బకాయిలు మొ॥ చెల్లించబడు అన్ని ఛార్జీలను ప్రత్యేకంగా బిడ్డరు భరించవలెను.
12. బ్యాంక్ నిర్ధారణకు లోబడి అమ్మకం/ వేలం ఉంటుంది.
13. వేలం వేయబడిన ఆస్తికి సంబంధించి ఏదైనా చార్జ్, లీన్, తాకట్టు, రుణభారాలు, ఆస్తిపన్ను లేదా ప్రభుత్వానికి లేదా ఏ సంస్థకైనా ఏదైనా ఇతర బకాయిలు ఉంటే అధీకృత అధికారి బాధ్యత వహించరు.
14. వారి బకాయిలు పూర్తిగా తిరిగి చెల్లించనట్లయితే, పైన తెలిపిన తేదీన వేలం అమ్మకం నిర్వహిస్తూ పైన పేర్కొన్న రుణంనకు సంబంధించిన రుణగ్రహీత / గ్యారంటారుకు ఇది నోటీసుగా కూడా ఉంటుంది.
15. వేలం ప్రక్రియ ద్వారా ఆస్తుల అమ్మకం సంపూర్ణం కాకపోతే SARFAESI చట్టంలోని నిబంధనల ప్రకారం ప్రైవేట్ ఒప్పందం ద్వారా బ్యాంక్ అమ్మకమునకు వర్తింపజేస్తుంది.
16. అధీకృత అధికారిచే తెలియజేయబడిన వివరాలు అతని పరిజ్ఞానం మేరకు మరియు రికార్డుల ప్రకారం ఉన్నాయి. ఏదైనా పొరపాటు, తప్పుడు స్టేట్‌మెంట్ లేదా వదిలివేసిన దానికి సంబంధించి అతను బాధ్యత వహించడు.
17. సెక్యూర్డ్ క్రెడిటార్స్‌కు అయిన అన్ని వ్యయాలు, ఛార్జీలు మరియు ఖర్చులతో సహా అన్ని బకాయిలు ఒకవేళ ఆస్తి అమ్మకమునకు నిర్ణయించిన తేదీలోగా ఏ సమయంలోనైనా పై పేరుగల రుణగ్రహీత / సహ రుణగ్రహీత / లీగల్ హెయిర్స్ తీర్చినట్లయితే అప్పుడు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తి విక్రయించబడదు. మరియు కాగోరు బిడ్డర్ల నుండి స్వీకరించబడే అన్ని బిడ్లు ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ పక్షాన ఎటువంటి బాధ్యత / క్లెయిమ్ లేకుండా వారికి వాపసు ఇవ్వబడును.
18. ఆఫర్ ఫారంతో సహా కాగోరు బిడ్డరు ఆదాయ పన్ను శాఖచే జారీ చేయబడిన PAN కార్డ్ కాపీ మరియు అతని / ఆమె గుర్తింపు రుజువు మరియు నివాస రుజువు అంటే ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్, ఎలక్షన్ కమిషన్ కార్డ్, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ మొ॥ వాటి కాపీ కూడా జతచేయాలి.

తేది : 13-06-2024, విశాఖపట్నం **అధీకృత అధికారి, ఎం.వి.పి. కోలనీ బ్రాంచి**

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, జూన్ 13: నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు. నరసింహనగర్, రైతుబజారు ఏరియాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

17నుంచి విశ్వేశ్వర స్వామి కల్యాణోత్సవాలు

మహారాణిపేట, జూన్ 13: మహారాణిపేట పరిధిలోని శ్రీవిశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవాలను ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ మేనేజర్ అడపా దేవుళ్ళు తెలిపారు. ఈనెల 23 వరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 17న మండపారాధన, త్రిశూలపూజ, స్వామి కల్యాణం జరుగుతుందని, 18 నుంచి ప్రత్యేక హోమాలు నిర్వహిస్తామని ఆయన వివరించారు.

సెయింట్ అంథోని చర్చి ఉత్సవాలు

మహారాణిపేట: స్థానిక పునీత్ సెయింట్ అంథోని చర్చి మహోత్సవాలు గురువారం జరిగాయి. విద్యార్థులకు నిర్వహించిన పోటీల విజేతలకు ఫాదర్ డి.బాలశౌరి బహుమతులు అందజేశారు.









టీఎస్సార్ కాంప్లెక్స్ వద్ద భారీ గోతులతో నిండిపోయిన రహదారి



కృష్ణాగార్డెన్స్ కాలువపై శిథిలమైన సిమెంట్ పలకలు

ప్రధాన రహదారుల్లో ప్రమాదకర ప్రయాణం

- ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో అధ్వానంగా రోడ్లు
- గోతులతో నిత్యం ప్రమాదాలు

డాబాగార్డెన్స్, జూన్ 13: జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని పలు ప్రాంతాల్లో రహదారులపై రాకపోకలు సాగించాలంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ బస్టాండ్ ఎదురుగా టీఎస్సార్ కాంప్లెక్స్ వద్ద రోడ్డులో సగానికి పైగా కోతకు గురైంది. దీంతో అటు వెళ్లే వాహనదారులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. కృష్ణాగార్డెన్స్‌లోని రహదారులు ఛిద్రమై అధ్వాన స్థితిలో ఉన్నాయి. రాత్రి వేళలో ఇటుగా రాకపోకలు సాగించే వారి వాహనాలు గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే రహదారుల దుస్థితికి కారణమని స్థానికులు వాపోతున్నారు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా పనిచేయాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖపట్నం, జూన్ 13: విద్యార్థుల బంగారు భవిష్యత్తే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించుకొని, ఆ దిశగా పనిచేయాలని , వారి అభ్యున్నతి కోసం ప్రత్యేక సమయం కేటాయించి ఉత్తమ సేవలందించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సాంఘిక, బీసీ సంక్షేమశాఖ అధికారులను ఆదేశించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలు, వసతి గృహాల్లో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్యంపై దృష్టిసారించాలన్నారు. విద్యా సంవత్సరంలో చేపట్టాల్సిన పనులు, రూపొందించాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. రూ.11కోట్లతో 29 వసతిగృహాల ఆధునికీకరణ పనులు చేపట్టామన్నారు. శాశ్వత తాగునీటి సదుపాయం కల్పించేలా వాటర్ ప్యూరిఫైడ్ ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. క్రీడా పరికరాలు అందిస్తామన్నారు. విశాఖ విద్యా వసతి వికాసం పేరుతో చేపట్టిన అన్ని పనుల ప్రగతిని వివరించారు. సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు రామారావు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులను పీపీటీ ద్వారా వివరించారు. బీసీ వెల్ఫేర్ అధికారిణి శ్రీదేవి, డీఈవో చంద్రకళ, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్లు ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



ఎస్ఈ సత్యనారాయణరాజుకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే

డాబాగార్డెన్స్, జూన్ 13: నియోజకవర్గంలోని సమస్యలన్నింటినీ పరిష్కరించడమే ధ్యేయమని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం డాబాగార్డెన్స్ కృష్ణాగార్డెన్స్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్యేకు తమ ప్రాంతంలోని సమస్యలను వివరించారు. వాటిపై స్పందించిన వంశీకృష్ణ సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గం చూపించాలని ఆదేశించారు. కాలుష్య సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు వీలుగా ఎస్ఈ సత్యనారాయణరాజుకు పలు సూచనలిచ్చారు.



తోటగరువు జిల్లా పరిషత్ పాఠశాలకు వెళుతున్న విద్యార్థినులు



విద్యార్థుల హాజరు తీసుకుంటున్న ఉపాధ్యాయిని



ప్రార్థన చేస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు

పాఠశాలలు పునః ప్రారంభం

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభించారు. ఉదయమే పిల్లలంతా పాఠశాలలకు బ్యాగులు తీసుకుని హాజరయ్యారు. తరగతులకు అనుగుణంగా పాఠశాలలను సిద్ధం చేశారు. కొన్నిచోట్ల ఎక్కువ మంది పిల్లలు, మరికొన్ని చోట్ల తక్కువగా హాజరయ్యారు. విద్యార్థులు రావడంతో పాఠశాల ఆవరణలు సందడిగా మారాయి. అయితే ప్రభుత్వం అందజేసిన స్టూడెంట్ కిట్లు అక్కడక్కడా పంపిణీచేయగా మిగిలిన చోట్ల ఒకట్రెండు రోజుల్లో అందజేయనున్నారు. కొన్నిచోట్ల పిల్లలకు ఇబ్బంది లేకుండా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.

రాష్ట్రంలో స్వర్ణ యుగం ఆరంభం : భీమిలి ఎమ్మెల్యే గంటా

సిరిపురం, జూన్ 13: రాష్ట్రంలో స్వర్ణ శకం ఆరంభమైందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రజలకు బంగారు భవిష్యత్తు ఇచ్చే చంద్రబాబునాయుడు పాలన మొదలైందన్నారు. ఐదేళ్లగా అదిగో డీఎస్సీ. ఇదిగో డీఎస్సీ అంటూ మాటలతో ఊదరకొట్టి నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తించిన వైసీపీ పాలన ముగిసి చంద్రన్న పాలన రావడంతో ఉద్యోగాల వెల్లువ మొదలైందన్నారు. నిరుద్యోగుల ఐదేళ్ల కష్టాలు తీరేలా ఏకంగా 16,347 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి యువతకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. అలాగే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, రూ. 4 వేలకు పింఛన్ పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణన ఫైళ్లపై సంతకాలు చేసి చంద్రబాబు మార్క్ పాలనకు శ్రీకారం చుట్టారన్నారు.

చంద్రబాబు పాలనలోనే అభివృద్ధి

మహారాణిపేట: చంద్రబాబు పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి పథాన నడుస్తుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకుడు కర్రి వేణుమాధవ్ అన్నారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మెగా డీఎస్సీ, అన్నక్యాంటీన్లు తదితర అతి ముఖ్యమైన ఐదు ఫైళ్లపై సంతకం చేయడం హర్షించదగ్గ పరిణామమన్నారు. రానున్న కాలంలో రాష్ట్రం ప్రగతిపథంలో పయనించబోతోందనడానికి ఇవి ఉదాహరణలన్నారు. వైసీపీ పాలనలో గాడి తప్పిన అన్ని వ్యవస్థలను తిరిగి నిలబెట్టే సత్తా ఉన్న నేత చంద్రబాబు మాత్రమేనన్నారు.

45వ వార్డులో సంబరాలు

అక్కయ్యపాలెం: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా 45వ వార్డు టీడీపీ అధ్యక్షుడు భరణికాన రాజు నరసింహనగర్‌లో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. చంద్రన్న పాలనలో ప్రజలు రానున్న సుఖశాంతులతో జీవిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

విశాఖ-కడప రైళ్ల నంబర్లు మార్పు

విజయవాడ: బెజవాడ డివిజన్ పరిధిలోని పలు రైళ్ళ నెంబర్లను రైల్వే అధికారులు మార్చారు. వచ్చే నెల జూలై 1 నుంచి పలు రైళ్ళ నెంబర్లు మారతాయి. ఈ మేరకు ఐఆర్‌సీటీసీ రిజర్వేషన్ పోర్టల్‌లో కూడా రైల్వే అధికారులు మార్పులు, చేర్పులు చేస్తున్నారు. విశాఖపట్నం - కడప మధ్యన నడిచే రైలు నెంబర్ ప్రస్తుతం 17488 గా ఉంది. ఇక మీదట ఈ రైలు నెంబర్ 18521 గా ఉంటుంది. అలాగే కడప - విశాఖపట్నం మధ్యన నడిచే రైలు నెంబర్ 17487ను 18522గా మార్చారు.

చైల్డ్‌వెల్ఫేర్‌కు యువకుడి అప్పగింత

సీతంపేట, జూన్ 13: నిరాదరణకు గురైన యువకుడ్ని ద్వారకా పోలీసులు చైల్డ్‌వెల్ఫేర్‌కి అప్పగించారు. మధురానగర్‌కు చెందిన ఒమ్మి ఉమే ష్‌కుమార్ తండ్రి వదిలి వెళ్లిపోయాడు. స్థానికులు అతడిని ద్వారకా పోలీసుస్టేషన్‌కి తీసుకువచ్చారు. దీంతో ఆరిలోవలో గల చైల్డ్‌వెల్ఫేర్‌కు అప్పగించినట్టు ఎస్ఐ రత్నం తెలిపారు.

మెగా డీఎస్సీపై నిరుద్యోగుల హర్షాతిరేకాలు

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించిన తరువాత మెగా డీఎస్సీపై తొలి సంతకం చేయడాన్ని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో నిరుద్యోగ ఉపాధ్యాయులు స్వాగతించారు. ఈ మేరకు గురువారం వారంతా థ్యాంక్యూ సీఎంసార్ అంటూ ప్లకార్డులతో సంబరాలు జరుపుకున్నారు. పౌరగ్రంథాలయం ఆవరణలో ప్లకార్డులు పట్టుకుని ధన్యవాదాలు తెలిపారు.

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకం

పూర్ణామార్కెట్, జూన్ 13: వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గురువారం త్రికాల పంచామృతాభిషేక సేవలను నిర్వహించారు. ఉద యం 8 గంటల సమయంలో జరిగి న ప్రత్యేక పూజలో 20 మంది ఉభ యదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేకం, జలాభిషేకంతో పూజలు జరిగాయి.

మాది కూల్చివేతల ప్రభుత్వం కాదు

- నీటి వివాదాలపై ఒడిశాతో చర్చించి పరిష్కారం
- ఫ్రీహోల్డ్ అనుమతులపై విచారణ
- విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న విజయనగరం ఎంపీ అప్పలనాయుడు

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు హయాంలో కూల్చివేతలు ఉండవని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల పిల్లలకు ఇచ్చే బ్యాగులపై మాజీ సీఎం జగన్ ఫొటో ఉన్నా పంపిణీ చేయాలని చంద్రబాబు ఆదేశించారన్నారు. ఆయన ముందుచూపుతో వ్యవహరిస్తారనడానికి ఇదో ఉదాహరణ అన్నారు. ఆదాయ మార్గాల పెంపు, వాటిని జాగ్రత్తగా ఖర్చుచేయడం ఆయనకు మాత్రమే తెలుసునన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ప్రచార ప్రభుత్వం కాదన్నారు. వైసీపీ హయాంలో ఆస్తులు కూల్చడం చూశామని, ఇక నుంచి ఆస్తులు కాపాడం చూస్తామన్నారు. సామాజిక న్యాయం పాటించే మంత్రిపదవులు ఇచ్చారన్నారు. ఎన్నికల్లో టిక్కెట్ల కేటాయింపు, మంత్రి పదవుల్లో ఉత్తరాంధ్రకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. రాష్ట్రంలో వైసీపీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని మాజీ సీఎం జగన్ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఈనెల 27 నుంచి ప్రజల్లోకి వస్తామని జగన్ ప్రకటనను స్వాగతిస్తూ, ప్రజాస్వామ్యంలో విపక్షం తన వంతు పాత్ర పోషించాలన్నారు. నాగావళి, వంశధార, జంఝావతి నీటి ప్రాజెక్టులు, సరిహద్దులపై ఒడిశాతో ఉన్న వివాదాల పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు. విజయనగరం జిల్లా భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ, కొత్తవలస మండలాల్లో భారీగా డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీచేయించిన కీలక నేతల విచారణ జరుపుతామన్నారు. రుషికొండలో భవనం ప్రజాప్రయోజనాల కోసం వినియోగిస్తామన్నారు. సమావేశంలో పొలమరశెట్టి శ్రీనివాసరావు, కె.గోపాలరెడ్డి పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు నజీర్ శుభాకాంక్షలు



చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నజీర్

మహారాణిపేట, జూన్ 13: రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబు నాయుడుకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ శుభాకాంక్షలు తెలియజేశారు. అమరావతిలో ని ముఖ్యమంత్రి కార్యాలయంలో గురువారం చంద్రబాబును కలిసి మైనారిటీ విభాగం తరపున శాలువాకప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మెగా డీఎస్సీపై సంతకం

... 5వ పేజీ తరువాయి

టీచర్ ఒకరు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర విభజన తరువాత రెండు పర్యాయాలు డీఎస్సీలు నిర్వహించారు. అయితే ఇప్పుడు ప్రకటించినన్ని పోస్టులు గతంలో ఎన్నడూ భర్తీచేయలేదని నిరుద్యోగులు అంటున్నారు. ఐదేళ్ల నుంచి అనేక పోరాటాలు చేసినా జగన్ ప్రభుత్వం కనీసం స్పందించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం చంద్రబాబునాయుడు సంతకం చేసిన నేపథ్యంలో త్వరలోనే డీఎస్సీ ప్రకటన వెలువడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

జీవితాల్లో వెలుగులు నింపారు

ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు, వారాహి యాత్రలో పవన్‌కల్యాణ్‌లు నిరుద్యోగ ఉపాధ్యాయులకు డీఎస్సీపై ఇచ్చిన హామీని నిలుబెట్టుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. సంస్కరణల పేరిట ఉన్న పోస్టులను రద్దు చేసి జగన్ ప్రభుత్వం నిరుద్యోగులతో చెలగాటమాడింది. దీనికి భిన్నంగా మెగా డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పినట్టుగానే సంతకం చేసి మా జీవితాల్లో వెలుగులు నింపారు. వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలి. **- కె.జాన్సీరామ్, నిరుద్యోగ ఉపాధ్యాయుడు**

పెన్షన్‌దారులకు పండగ

... 5వ పేజీ తరువాయి

సంబంధించి నెలకు రూ.1000 చొప్పున మూడు వేలు, పెంచిన రూ.నాలుగు వేలు మొత్తం జూలైలో ప్రతి పింఛన్‌దారుకి రూ.ఏడు వేలు అందనున్నది. మూడు నెలలకుగాను వెయ్యి వంతున జిల్లాలో పింఛన్‌దారులకు రూ.49,09,65,000లు విడుదల చేస్తారు. మొత్తం చూస్తే రూ.114,11,09,500 విడుదలకానున్నాయి. విశాఖ జిల్లాలో మొత్తం 1,65,432 మందికి 16 రకాల పింఛన్ల కింద రూ.49,95,02500 అందజేస్తున్నారు. అయితే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోకి వచ్చిన పింఛన్లు 1,740, సైనిక వెల్ఫేర్ పింఛన్లు 34, భూమి లేని పేదలు ముగ్గురు వెరసి 1,777 మందికి రూ.ఐదు వేల నుంచి రూ.10 వేల పింఛన్ ఇస్తున్నారు. వీరిని మినహాయించగా 1,63,655 మందికి ప్రస్తుతం ప్రతి నెలా రూ. మూడు వేల పింఛన్ అందుతుంది. వీరిలో వృద్ధులు 74,198 మంది, వితంతువులు 54,565 మంది, విభిన్న ప్రతిభావంతులు 21,660 మంది ఉండగా, మిగిలినవారు ఇతర కేటగిరీలు ఉన్నారు. అయితే ప్రతి నెల జిల్లాలో పింఛన్ తీసుకునేవారి సంఖ్య స్వల్పంగా మారుతుందని అధికారులు చెబుతున్నారు. తాజా నిర్ణయంతో జిల్లాలో 1,63,655 మందికి ప్రయోజనం లభిస్తోందని పేర్కొన్నారు.

అన్న క్యాంటీన్‌లు సిద్ధం

... 5వ పేజీ తరువాయి

భవనాలను వార్డు సచివాలయాలకు వినియోగిస్తే చాలాభవనాలు నిరుపయోగంగా ఉండిపోయాయి. తాజాగా కూటమి అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్లను తిరిగి అందుబాటులో ఉంచాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజే (గురువారమే) అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించే ఫైలుపై సంతకం చేశారు. అన్న క్యాంటీన్ భవనాలు ఇప్పుడు ఏ స్థితిలో ఉన్నాయనేదానితో పాటు వాటిని శుభ్రం చేసిన తర్వాత తీసిన ఫొటోలను సీఎం కార్యాలయానికి పంపించాలంటూ జీవీఎంసీ యూసీడీ అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో సిబ్బంది గురువారం యుద్ధప్రాతిపదికన అన్న క్యాంటీన్లను శుభ్రం చేసి ఫొటోలను ఉన్నతాధికారులకు పంపించారు. అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్ణయంపై నిరుపేదలు, దినసరి కూలీలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

విశాఖ విమల విద్యాలయం మూత

... 5వ పేజీ తరువాయి

నిర్వహణను క్రిస్టియన్ సంస్థలు బాగా చేయగలవని విశ్వసించి మహారాణిపేటకు చెందిన 'ది వైజాగపటం డయాసిస్ కార్పొరేటషన్ ప్రైవేటు లిమిటెడ్' సంస్థకు అప్పగించారు. వీరితో ఐదేళ్లకు ఒకసారి అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకొని నిర్వహణకు అవసరమైన ఆర్థిక సాయం చేస్తున్నారు. ఉక్కు టౌన్‌షిప్‌లోని ఆరో సెక్టార్‌లో పది ఎకరాల విస్తీర్ణంలో ఈ పాఠశాల నిర్మాణానికి, మౌలిక వసతుల కల్పనకు స్టీల్‌ప్లాంటే నిధులు ఇచ్చింది. సిబ్బంది జీతభత్యాలు, తదితరాలకు ఐదేళ్లకు రూ.7 కోట్ల వరకూ సాయం చేస్తోంది. ఈ వైపు నుంచి సాయం అందుతున్నందున డయాసిస్ సంస్థ నామమాత్రపు ఫీజుతో విద్యార్థులకు విద్యా బోధన చేస్తోంది. దాంతో ఆదరణ పెరిగింది. ప్రస్తుతం రెండు వేల మంది పిల్లలు ఇక్కడ చదువుతున్నారు. పిల్లలు ఎక్కువ మంది వస్తున్నారని బాలచెరువు రోడ్డులో మరో పాఠశాల ఏర్పాటుచేయగా వేయి మంది వరకు చదువుతున్నారు. దానికి కూడా ఐదేళ్లకొకసారి ఎంఓయూ చేసుకుంటున్నారు.

మే 31తో ముగిసిన ఎంఓయూ

డయాసిస్‌తో 2019లో చేసుకున్న ఐదేళ్ల ఒప్పందం ఈ ఏడాది మే 31తో ముగిసిపోయింది. దాంతో స్టీల్ యాజమాన్యం డయాసిస్ ప్రతినిధులను పిలిచి మాట్లాడింది. ప్లాంటు ఆర్థిక స్థితి బాగా లేనందున ఇకపై ఆర్థిక సాయం చేయలేమని, సొంతంగా విద్యాలయాన్ని నడుపుకోవాలని స్పష్టంచేసింది. ఈ అంశాన్ని వెంటనే సిబ్బందికి తెలియజేయాల్సిన డయాసిస్ బృందం, బుధవారం చావు కబురు చల్లగా చెప్పింది. 'విద్యాలయాన్ని మూసివేస్తున్నామని, రేపటి నుంచి రావలసిన అవసరం లేదు' అని వెల్లడించింది. దాంతో వారంతా ఉక్కు కార్మిక సంఘ నాయకులను కలిశారు. వేసవి సెలవుల జీతం రావాలంటే...విద్యా సంవత్సరం ప్రారంభం రోజున పాఠశాలకు వెళ్లి రిజిస్టర్‌లో సంతకం చేయాల్సి ఉంటుందని, అందుకోసం గురువారం వెళ్లగా, తమను అనుమతించలేదని ఉపాధ్యాయులు ఆరోపించారు. ఈ విషయాలు ఏవీ తెలియని పిల్లలు యథాప్రకారం పాఠశాలకు రాగా గేట్లు తీయలేదు. ఈ సమాచారం తెలిసి తల్లిదండ్రులు వచ్చి ఆందోళనకు తెర తీశారు.

పుస్తకాలు, యూనిఫామ్ కొనిపించారు

స్టీల్‌ప్లాంటుతో ఎంఓయూ పునరుద్ధరణ కాలేదని తెలిసినా డయాసిస్ ఆ విషయం బయట పెట్టకుండా రెండు వేల మంది పిల్లలతో కొత్త తరగతుల పుస్తకాలను పాఠశాల ఆవరణలోనే కొనిపించింది. కొత్త యూనిఫాంలు కూడా విక్రయించింది. అంతేకాకుండా ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి వరకు సుమారు 100 మందికి కొత్తగా అడ్మిషన్లు ఇచ్చింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలావుండగా బాల చెరువు రోడ్డులోని పాఠశాల మాత్రం యథావిధిగా కొనసాగుతోంది. వారి ఎంఓయూ 2027 వరకు ఉందని సమాచారం.

సొంతంగా నడుపుకోవాలని సూచించాం: విశాఖ ఉక్కు

విద్యాలయం వివాదంపై స్టీల్‌ప్లాంటు యాజమాన్యం స్పందించింది. మూసివేస్తున్నామనేది వాస్తవం కాదని తెలిపింది. ఆర్థిక ఇబ్బందుల వల్ల సాయం చేయలేమని చెప్పామని, సొంతంగా నడుపుకోవాలని, ఆ మేరకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించామని యాజమాన్యం వెల్లడించింది.

కొనసాగేలా చూస్తాం

విశాఖ విమల విద్యాలయం సమస్యను పరిష్కరిస్తాం. స్టీల్‌ప్లాంటు ఎందరికో సామాజిక బాధ్యత కింద ఆర్థిక సాయం చేస్తోంది. ఈ ప్రాంతం పిల్లల చదువుకు తప్పకుండా సాయం అందించాలి. యాజమాన్యంతో మాట్లాడి విద్యాలయం కొనసాగేలా చేస్తాం. **- పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే, గాజువాక**

జీవీఎంసీకి కొత్తభవనం నిర్మాణంపై సందిగ్ధం

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వం కూడా సమ్మతించింది. అయితే ఆయా ప్రాజెక్టులకు అంచనాలను భారీగా పెంచేశారని, దీనివెనుక వైసీపీ నేతల ఒత్తిడి ఉందని కూటమి నేతలు అనుమానిస్తుండడంతోనే వాటిని తాత్కాలికంగా నిలుపు చేయాలని అధికారులను ఆదేశించినట్టు జీవీఎంసీలో ప్రచారం జరుగుతోంది.

ఎస్‌డీఎఫ్ బిల్లులకు మోక్షం కలిగేనా

... 5వ పేజీ తరువాయి

కూటమి నేతల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు రాష్ట్ర మునిసిపల్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడారు. పనులు పూర్తిచేసి ఆరున్నరేళ్లవుతున్నాసరే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోతే ఎలాగని ప్రశ్నించినట్టు తెలిసింది. మునిసిపల్ శాఖ అధికారులు దీనిపై జీవీఎంసీ అధికారులను ఆరా తీయగా ఎస్‌డీఎఫ్ పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల వివరాలను పంపించినట్టు తెలిసింది.

AJC CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, KOVI PARWATHI (Old Name), W/o. Kovi Raghavendra Rao, resident of F.No.312, 1-1, Sri Satya Residency, Koppaka, Anakapalli. Change my name from KOVI PARWATHI (Old Name) to KOVI PARVATHI (New Name). Hence forth I am being called as KOVI PARVATHI (New Name), W/o. Kovi Raghavendra Rao for all purposes.

AJV_192951

CHANGE OF NAME

★ I, GUBBALA CHINA SATYAVATHI (Old Name), W/o. Gubbala Sri Rama, resident of 7-201, Narasimharao Peta, Jinnuru, Poduru, West Godavari Dist. Change my name from GUBBALA CHINA SATYAVATHI (Old Name) to GUBBALA SATYAVATHI (New Name). Hence forth I am being called as GUBBALA SATYAVATHI (New Name), W/o. Gubbala Sri Rama for all purposes.

AJV_192952

DISTANCE EDUCATION

★ ఫెయిల్ అయిన విద్యార్థులు డిగ్రీ పాస్ గ్యారెంటీతో కంప్లీట్ చేయుటకు అవకాశం కలదు. B.Tech., Degree, Diploma, MBA etc. Ph: 7997296796

AJV_183391

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176, 9966165093

ముగిసిన లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు

ఆరిలోవ, జూన్ 13 : జీవీఎంసీ పదో వార్డులోని పాత డెయిరీ ఫారానికి సమీపంలో రాజీనగర్‌లో ఉన్న లక్ష్మీ నారాయణ ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిసాయి.ఉత్సవాల్లో భాగంగా వేకువజామున భక్తులు స్వామివారికి, అమ్మవార్లకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

తునిపాలంలో ముత్యాలమ్మ పండగ

పద్మనాభం (రూరల్), జూన్ 13 : మండలంలోని మద్ది పంచాయతీ తునిపాలం గ్రామంలో ముత్యాలమ్మ పండగ గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ అర్చకుడు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. అనంతరం అమ్మవారి ఘటాలను వీధుల్లో ఊరేగించి, గుడిలో ఉంచారు పండగ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

పద్మనాభంలో...

పద్మనాభం : పద్మనాభంలో ముత్యాలమ్మ పండగ గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ఆలయ పూజారి గురునాయుడు ఆధ్వర్యంలో పూజలు చేసి చదురుగుడి నుంచి అమ్మవారిని డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అనంతరం సతకంపట్టు వద్ద అమ్మవారిని నిలిపి పూజలు చేశారు. అక్కడి నుంచి సాము గరిడీలతో ఊరేగింపుగా జంక్షన్‌లో ఉన్న ఆలయానికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా యువకులు చేసిన సాముగరిడీలు అలరించాయి. ఆలయంలో అమ్మవారికి జలాభిషేకం చేసిన తరువాత భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమతో విశేష పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి : యూటీఎఫ్

పద్మనాభం (రూరల్), జూన్ 13 : రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉప్పాడ అప్పారావు కోరారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జీవో 117ను రద్దు చేసి ఉన్నత పాఠశాలల్లో ఉన్న 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలలకు పంపాలన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, బోధనకు అడ్డంకిగా ఉన్న అన్ని రకాల యాప్‌లను రద్దు చేయాలని. బదిలీలను మ్యాన్‌వల్ పద్ధతిలో చేపట్టాలని కోరారు.

గంజాయి పట్టివేత

విశాఖపట్నం, జూన్ 12 : విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను గురువారం రైల్వే పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ.47,500 విలువ చేసే 9.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న సమయంలో వెస్ట్‌బెంగాల్, ముషిదాబాద్‌కు చెందిన జులు రెహ్మాన్, రాజన్ థండర్ గంజాయితో పట్టుబడ్డారని తెలిపారు.

గంగవరం పోర్టు కార్మికులు ప్రశాంత జీవనాన్ని కొనసాగించాలి : సీపీ



పెదగంట్యాడ, జూన్ 13 : గంగవరం పోర్టు ఆర్అండ్ఆర్ కార్మికులు ప్రశాంత జీవనాన్ని కొనసాగించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవి శంకర్ అయ్యన్నార్ ఆకాంక్షించారు. అదానీ గంగవరం పోర్టు ఆర్ అండ్ ఆర్ కార్మికులు గురువారం రాత్రి పెద గంట్యాడ పారిశ్రామికవాడ ఆడిటోరియంలో నిర్వహించిన సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.గంగవరం పోర్టు కార్మికులకు పోర్టు యాజమాన్యం ఇచ్చిన ప్యాకేజీ మొత్తాన్ని తమ అభివృద్ధికి వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఆర్అండ్ఆర్ కార్మికులు సీపీకి వల, చేప, తదితరమైన వాటిని అందజేసి దుశ్శాలువాతో సంప్రదాయబద్ధంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, డీసీపీ సత్తిబాబు, ఏసీపీ మోజెస్‌పాల్, గంగవరం పోర్టు సీఈవో అమిత్ మాలి, సీఐ దాలిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మహారాజ :** మెలోడీ, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
- **మ్యూజిక్ షాపు మూర్తి:** రమాదేవి, విశేష్ (గాజువాక)
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **సత్యభామ :** సంగం, శ్రీకన్య (గాజువాక)
- **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి :** వెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **గం గం గణేశా :** వెంకటేశ్వర, శ్రీకన్య (గాజువాక)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36,టమాటా 50, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 36, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 46, బీరకాయలు 48, ఆనపకాయలు 26, కాలీఫ్లవర్ 42, క్యాబేజ్ 24, క్యారేట్ 30, దొండకాయలు 28, బంగాళా దుంపలు 28, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 170, బరబటి 60, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 124, పొటల్స్ 34, కీరదోస 28, కాప్సికమ్ 72, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 125
ఫారం ధర	-- 145
విత్ స్కిన్	-- 260
స్కిన్‌లెస్	-- 270



భీమిలిలో అన్న క్యాంటీన్ భవనం వద్ద తుప్పలు తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది



మారికివలసలో అన్న క్యాంటీన్‌ను శుభ్రం చేస్తున్న కార్మికులు

అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు ఏర్పాట్లు

మధురవాడ/భీమునిపట్నం, జూన్ 13 : అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం సాయంత్రం అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై సచివాలయంలో ఒకవైపు సంతకం పెడుతుండగా.. మరోవైపు మధురవాడ పరిసరాల్లోని అన్నక్యాంటీన్లను జీవీఎంసీ అధికారులు ఆఘమేఘాల మీద శుభ్రం చేయించారు. మధురవాడ పరిసరాల్లో మారికివలస, వాంబేకాలనీలో రెండు అన్న క్యాంటీన్లను 2018 మార్చి 15న అప్పటి మానవ వనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ క్యాంటీన్ల ద్వారా రూ. 5 లకే పేదలకు భోజనం పెట్టేవారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్న క్యాంటీన్లు మూతపడడంతో పేదలు భోజనం కోసం అష్టకష్టాలు పడ్డారు. ముఖ్యంగా రోజు కూలీలు, చిరుద్యోగులకు అన్న క్యాంటీన్లు బాగా ఉపయోగపడేవి. రోజుకు రూ. 15 లతో భోజనం, అల్పాహారం సమకూరేది. రోజు కూలీలు ఇంటి వద్ద నుంచి క్యారేజ్ తీసుకువెళ్లకుండా పనిచేసే ప్రాంతంలో ఉండే అన్న క్యాంటీన్‌కు వెళ్లి మధ్యాహ్నం భోజనం చేసేవారు. క్యాంటీన్లు మూతపడిన తరువాత వారంతా ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మళ్లీ వాటిని పునరుద్ధరిస్తూ సంతకం చేయడంతో ఆనందం వ్యక్తమవుతోంది. అలాగే భీమిలి పట్టణంలోని చిన్నబజారు మేదరవీధి వద్ద ఉన్న అన్నా క్యాంటీన్‌ను జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది గురువారం శుభ్రపరిచారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మళ్లీ వాటి పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. ఈమేరకు క్యాంటీన్ చుట్టూ ఉన్న తుప్పలు, ముళ్ల పొదలను భీమిలి జోన్ ఏఎంహెచ్‌వో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది శుభ్రపరిచారు.



వాంబే కాలనీలో కేక్ కట్ చేస్తున్న నాగోతి శివాజీ, తదితరులు



13వ వార్డులో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుతున్న నాయకులు

చంద్రబాబు ఐదు సంతకాలపై హర్షం

మధురవాడ, జూన్ 13 : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఐదు ఫైళ్లపై సచివాలయంలో గురువారం సంతకాలు చేయడంతో కూటమి నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ, తదితరులు వాంబే కాలనీలో కేక్ కట్ చేసి, సంబరాలు జరిపారు.ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటలింగ్ యాక్టు రద్దు, సామాజిక పెన్షన్ రూ.4000 లకు పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, స్కిల్ డెవలప్‌మెంట్ సెన్సెస్ ఫైళ్లపై సంతకాలు చేయడం శుభపరిణామమని చెప్పారు. అనంతరం శివాజీని స్థానికులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మంత్రి అప్పన్న, కోరాడ రాజు, సంతోష్‌కుమార్, శ్రావణ కుమార్, గణపతి, మహేష్, మురళీ, సీతారామ్, వరలక్ష్మి, లీల, లక్ష్మీ, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీపై ఎస్టీయూ హర్షం

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ఫైల్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం సచివాలయంలో సంతకం చేయడంపై స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు హర్షం వ్యక్తం చేశారు. ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే డీఎస్సీ ప్రకటనపై తొలి సంతకం చేసి చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారని చెప్పారు.

పింఛన్ పెంపుపై ఆనందం

ఆరిలోవ : సామాజిక పింఛన్లను రూ. 3 వేల నుంచి రూ. 4 వేలకు పెంచడం హర్షణీయమని 13వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పత్రకుండ ధర్మారావు, ప్రధాన కార్యదర్శి యల్లమల్లి సురేష్, మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి అన్నారు. గురువారం వారు ఆ వార్డులో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు.

ఘనంగా పురటాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

సింహాచలం, జూన్ 13 : వరాహలక్ష్మీనృసింహస్వామి సహోదరి, అడివివరం తదితర ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పురటాలమ్మ నూతన విగ్రహ ప్రతిష్ఠ గురువారం ఘనంగా జరిగింది. నూతన విగ్రహానికి పంచామృతాలతో లండ వంశీయులు విశేష అభిషేకాలు చేశారు. అంతకుముందు నూతన విగ్రహాన్ని ధాన్యాధివాసం, జలాధివాసాలు చేసి దర్పణ సేవలు నిర్వహించారు. సింహాచలం దేవస్థానం పండితులు శాస్త్రోక్తముగా ప్రత్యేక పూజలు చేయగా ఈఓ శ్రీనివాసమూర్తి, 98వ వార్డు కార్పొరేటర్ నరసింహం, పూజారి వంశానికి చెందిన అడివివరం మాజీ సర్పంచ్ లండ వెంకటరమణ, తదితరులు కొబ్బరికాయలు కొట్టి నూతన విగ్రహానికి పూజలు జరిపారు. అనంతరం వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నెల రోజుల క్రితం అడివివరం గ్రామ దేవత పైడితల్లెమ్మ ఆలయ ఆవరణలోని పురటాలమ్మ విగ్రహాన్ని మద్యం మత్తులో ఓ వ్యక్తి విరగగొట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

యువతకు క్రీడా స్ఫూర్తి ఉండాలి

సింహాచలం, జూన్ 13 : యువతకు క్రీడా స్ఫూర్తి ఉండాలని 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం అన్నారు. అడివివరం గ్రామదేవత పైడితల్లమ్మ వార్షిక పండగను పురస్కరించుకుని వార్డుకు చెందిన గాంధీనగర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర కార్యదర్శి లండ శ్రీను, వార్డు అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ధర్మరాజు, బీసీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, నిర్వాహకులు గిరీష్, నాని, మురళీ పాల్గొన్నారు.

కైలాసగిరిపై రామ్‌చరణ్ సినిమా షూటింగ్



విశాఖ విమానాశ్రయంలో హీరో రామ్‌చరణ్

విశాలాక్షినగర్, జూన్ 13 : రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న గేమ్ ఛేంజర్ సినిమా షూటింగ్ గురువారం కైలాసగిరిపై జరిగింది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎన్. శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్‌ఎస్ తమన్ సంగీతం సమకూరుస్తున్నారు. షూటింగ్‌లో భాగంగా కొండ శివారులో హీరో రామ్‌చరణ్, హీరోయిన్ కియారా అద్వానీపై కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. షూటింగ్ అనంతరం రామ్‌చరణ్ నొవాటెల్‌కు వెళ్లారు. నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో షూటింగ్ జరగనున్నట్టు చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు.

వెలగపూడికి బ్రాహ్మణుల ఆశీర్వాదం

మద్దిలపాలెం, జూన్ 13 : తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును ఆయన క్యాంపు కార్యాలయంలో శివాజీపాలేనికి చెందిన బ్రాహ్మణ పెద్దలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు వెలగపూడికి వేదమంత్రాలతో పూజలు చేసి, భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆశీర్వదించారు.

స్కూల్ బస్సులు తనిఖీ

మద్దిలపాలెం, జూన్ 13 : మద్దిలపాలెం జాతీయ రహదారిలో మోటారు వాహన తనిఖీ అధికారులు గురువారం స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. విద్యార్థులను స్కూళ్లకు తీసుకువెళ్లే బస్సులను నిలిపివేసి ఫిట్‌నెస్ పరిశీలించారు. డ్రైవర్ల లైసెన్స్ బస్ కండిషన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉప రవాణా కమిషనర్ రాజారత్నం మాట్లాడుతూ మద్దిలపాలెం, ఆనందపురం, గాజువాక, ఎన్ఏడీ జంక్షన్‌లలో స్కూల్ బస్సులను తనిఖీ చేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన ఏడు బస్సులపై కేసులు నమోదు చేశామని చెప్పారు. అలాగే ఫిట్‌నెస్ లేని ఒక బస్సును సీజ్ చేశామన్నారు. తనిఖీల్లో ఆర్టీవో అధికారులు కె. ప్రవీణ్‌కుమార్, ఏఎస్ గణేష్‌రెడ్డి, హరిప్రసాద్, మాధవి, సుమన్‌కుమార్, శిరీష దేవి, లలితా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్లు పంపిణీ

పద్మనాభం, జూన్ 13 : మండలంలోని పలు పాఠశాలలకు గురువారం పాఠ్య పుస్తకాలు, స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. 48 మండల పరిషత్ పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత పాఠశాలలు, 9 జెడ్పీ పాఠశాలలు, ఒక కేజీబీవీ పాఠశాలతో సహా 60 పాఠశాలలకు వీటిని అందించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటరు శ్రీనివాసరావు, ఎంఈఓ రమణ పాల్గొన్నారు.

అనాథ శరణాలయానికి ఏసీ బహూకరణ

తగరపువలస, జూన్ 13 : స్థానిక లిటిల్ హగ్స్ అనాథ శరణాలయానికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎయిర్ కండీషనర్‌ను బహూకరించారు. తన మనుమడు జిష్ణుబాబు పేరు మీద దీన్ని బహూకరించినట్టు శరణాలయం నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని విలువ రూ. 60 వేలు ఉంటుందని వారు చెప్పారు.

16న ఆంజనేయస్వామి తిరు కల్యాణం

భీమునిపట్నం, జూన్ 13 : పట్టణంలోని సుభాస్ రోడ్‌లో వున్న శ్రీ సువర్చల శ్రీదాస ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 16న స్వామివారి తిరు కల్యాణం నిర్వహించనున్నట్టు ఏఎం వంశీ మోహన చెన్నకృష్ణమాచార్యులు తెలిపారు. ఆదివారం ఉదయం పదిన్నర గంటలకు జరిగే కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సింహాచలం, జూన్ 13 : జీవీఎంసీ 98వ వార్డు అప్పన్నపాలెంలోని 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. అప్పన్నపాలెం, సింహపురి కాలనీ, శ్రీనివాసనగర్, వర్షిణీ అపార్టుమెంట్స్, పద్మావతి నగర్, రవినగర్ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.



ప్రత్యేక అధికారులకు మెమెంటోలు ఇస్తున్న శ్రీనివాసరావు

'నాణ్యతా ప్రమాణాలతో బోధన చేయాలి'

పద్మనాభం, జూన్ 13 : కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో ఉన్న తమైన నాణ్యతా ప్రమాణాలతో విద్యను అందించాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటరు బి.శ్రీనివాసరావు చెప్పారు. గురువారం ఆయన పద్మనాభం, భీమిలి, ఆనందపురం మండలాల కేజీబీవీల ప్రత్యేక అధికారులు, బోధనా సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు షై కెరీర్ యాప్ ద్వారా నాణ్యమైన విద్య అందించడంలో అధ్యాపకులు ప్రత్యేక దృష్టిసారించాలని చెప్పారు. ముఖ్యంగా చదువులో వెనుకబడిన పిల్లలపై శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం పదో తరగతిలో శతశాతం ఫలితాలు సాధించిన ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో కామన్ ఎగ్జామినేషన్ జిల్లా కార్యదర్శి ఎంవీ కృష్ణకుమార్, జీసీడీఓ కాలేషాబేగం తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో బాలిక మృతి

పద్మనాభం, జూన్ 13 : పాము కాటుతో బాలిక మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు పద్మనాభం పోలీసులు చెప్పారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం.. బాందేవుపురం గ్రామానికి చెందిన బోనెల లక్ష్మి (14) తల్లిదండ్రులతో పాటు ఇంటి ఆరు బయట నిద్రిస్తుండగా బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పాము కాటు వేసింది. బాలిక గట్టిగా కేక వేయడంతో తండ్రి సింహాద్రి నిద్రలేచి లైటు వేసి చూసేసరికి కాలిపై రెండు గాట్లు ఉన్నాయి. వెంటనే 108 వాహనంలో విజయనగరం పెద్దా ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

కొమ్మాది, జూన్ 13 : పీఎంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని మారికివలస రాజీవ్ గృహకల్ప కాలనీలో ధర్మారావు (60) అనే వృద్ధుడు ఇంటి టెర్రస్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం.. మారికివలస రాజీవ్ గృహకల్ప కాలనీలోని 100 నంబరు బ్లాకులో తాడుతూరి ధర్మారావు, భార్య సత్యవతితో కలిసి ఉంటున్నాడు. అతని కుమారుడు కూడా ఇదే కాలనీలో నివసిస్తున్నాడు. వారి స్వస్థలం విజయనగరం జిల్లా మెంటాడ. ధర్మారావు కొంతకాలంగా మానసిక సమస్యతో నగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.గురువారం ఉదయం అతన్ని చికిత్సకు తీసుకెళ్లడానికి కుటుంబసభ్యులు సిద్ధం చేస్తుండగా అకస్మాత్తుగా టెర్రస్ పైకెక్కి అక్కడ నుంచి దూకడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు.



గోవిందరాజస్వామి పుష్ప యాగానికి సిద్ధం చేసిన కలువ, తామర పూలు

టీటీడీకి తామర, కలువ పూలు

ఎంవీపీ కాలనీ, జూన్ 13 : తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగే గోవిందరాజస్వామి పుష్ప యాగానికి విశాఖ నుంచి మూడు వేల కలువ పూలు, రెండు వేల తామర పువ్వులను పంపించారు. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో వీటిని స్వామివారి ముందు ఉంచి, అనంతరం తిరుపతి పంపించారు. టీటీడీ కోరిన విధంగా ఎప్పటికప్పుడు నగరంలోని స్వామివారి భక్తులు హిమాంశు ప్రసాద్ ఆధ్వర్యంలో పలు సామగ్రిని పంపిస్తుంటారు. ఈసారి ఆయన ఆధ్వర్యంలో పూలు సేకరించి పంపించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వీధి రోడ్లు, డ్రైనేజీల పనులకు శంకుస్థాపన చేస్తున్న వెలగపూడి

ఆరిలోవ, జూన్ 13 : జీవీఎంసీ పదో వార్డులోని రవీంద్రనగర్‌లో జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 40 లక్షల జీవీఎంసీ నిధులతో రవీంద్రనగర్‌లో డ్రైనేజీలు నిర్మించనున్నట్టు చెప్పారు. తొలుత ఆయన ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్, టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, కార్యదర్శి సత్యన్నారాయణ, కొండమ్మ, రాజేష్, కట్ట మల్లేశ్వరరావు, కేవీ రమణ, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

అడవివరం పైడితల్లమ్మ పండగ ప్రారంభం



అమ్మవారి ఘటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

సింహాచలం, జూన్ 13 : అడివివరంతో పాటు ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత, అప్పన్న సహోదరి పైడి తల్లమ్మ వార్షిక పండగ బుధవారం సాయంత్రం నుంచి ప్రారంభమైంది. ఆచారం ప్రకారం సాయంత్రం జోగి, రాత్రి పూజారి వెంకటరమణ, మరికొందరు భక్తులు గరగలను శిరస్సున దాల్చి డప్పు వాయిద్యాల నడుమ గ్రామాల్లోని వీధుల్లో ఊరేగింపు జరిపారు. మార్గం పొడవునా ప్రతి ఇంటి వద్ద భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలు ఇచ్చి భక్తిగా స్వాగతించారు. ఈనెల 18తో ఈ పండగ పూర్తి కానుంది.

పండగ ఘనంగా చేద్దాం

పైడితల్లమ్మ వార్షిక పండుగను అత్యంత వైభవంగా నిర్వహించాలని దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి సారధ్యంలో సభ్యుల తీర్మానించారు. గురువారం సాయంత్రం వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నరసింహం మాట్లాడుతూ గత వైభవం గుర్తుకు వచ్చేలా గ్రామాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని చెప్పారు. 17న తొలేళ్లు, 18న అనుపోత్సవం పురస్కరించుకుని ప్రధాన వేదికలు ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో అడివివరం మాజీ సర్పంచ్ లండ వెంకట రమణ, టీడీపీ నేత శ్రీనివాస్, అమ్మవారి పూజారి లండ వెంకటరమణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సతివాడ శంకరరావు, దేవస్థానం ఏఈఓలు ఆనందకుమార్, రమణమూర్తి, నరసింగరావు పాల్గొన్నారు.

ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్

ఎం.వి.పి. కోలనీ బ్రాంచి, విశాఖపట్నం. ఫోన్ : 0891-2788478

సీల్డ్ టెండర్లు మరియు వేలం

SARFAESI చట్టంలోని సెక్షన్13(2) క్రింద బ్యాంక్ అధీకృత అధికారి డిమాండ్ నోటీసులను తే 13-01-2022 న రూ. 6,57,801/- (అక్షరములా ఆరు లక్షల యాభై ఏడు వేల ఎనిమిది వందల ఒక్క రూపాయి మాత్రమే) తేది 31-12-2021 నాటికి దర్మిలా వడ్డీ మరియు ఖర్చులతో చెల్లించవలసినదిగా 1) **శ్రీమతి మరబాడి నూకాలమ్మ (మరణించారు)**, W/o. (లేటు) సన్యాసి, 2) **శ్రీ మరబాడి రాము**, S/o. (లేటు) సన్యాసి, 3) **శ్రీ మరబాడి వెంకటేష్**, S/o. (లేటు) సన్యాసి, 4) **శ్రీ మరబాడి నూకరాజు**, S/o. (లేటు) సన్యాసి (వ. నెం. 2 నుండి 4 వరకు ఉన్న సభ్యులు వ. నెం. 1 కి చట్టబద్ధ వారసులు మరియు హామీదారులు) వారికి నోటీసులు ఇచ్చియున్నారు. మరియు SARFAESI చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద తే 20-07-2022 దీన ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్, ఎం.వి.పి. కోలనీ బ్రాంచి, విశాఖపట్నం వారికి తనఖా పెట్టిన ఈ దిగువ సుదహరించిన స్థిరాస్తిని SARFAESI చట్టం సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలు వినియోగించుకుంటూ స్వాధీనం చేసుకున్నారు. మరియు "ఎక్కడ వున్నది అక్కడ, ఎలా వున్నది అలాగా" వేలం వేయుటకు ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, ఎం.వి.పి. కోలనీ బ్రాంచి, విశాఖపట్నం, ఫోన్ నెం. 0891-2788478 వద్ద **తేది 18-07-2024 ఉదయం 10-00 గంటలకు** సీల్డ్ టెండరు మరియు బహిరంగ వేలం ద్వారా అమ్ముటకు ఈ దిగువ సంతకం చేసిన అధీకృత అధికారి నిర్ణయించినారు.

సీల్డు టెండర్లు ఓపెన్ చేయు తేది : 18-07-2024 గురువారం ఉదయం 10-00 గంటలకు

సీల్డు టెండర్లు మరియు వేలం వేయు స్థలం : ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, ఎం.వి.పి. కోలనీ బ్రాంచి, విశాఖపట్నం

తనఖా ఆస్థి వివరములు	బకాయి మొత్తం 30-04-2024 తేది నాటికి	రిజర్వు ధర రూ.	బయానా రూ. (EMD 10%)
జి.వి.యం.సి., విశాఖపట్నం, సర్వే నెం. 382, వార్డు నెం. 17 గాగల విశాఖపట్నం, వాల్తేరు వార్డు, చినవాల్తేరు, మధుర వీధి దగ్గరలోని	8,30,773/-	21,90,210/-	2,19,021/-

డోర్ నెం. 6-15-30గాగల (గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ & అసంపూర్తిగా ఉన్న 2వ అంతస్తుగాగల ఆర్.సి.సి. స్లాబ్ బిల్డింగ్ ఇల్లు.
హద్దులు : తూర్పు : "సి" షెడ్యూల్డ్ ఆస్థి (ఎం. చిన సన్యాసిరావు), దక్షిణం : మున్సిపల్ మురుగుకాలువ,
పడమర : 2 అడుగుల వెడల్పు ఉమ్మడి నడక దారి, ఉత్తరం : ఉమ్మడి నడక దారి **మొత్తం విస్తీర్ణం : 34.25 చ॥గజములు**

నియమ నిబంధనలు :

1. వేలంలో పాల్గొనేందుకు కాగోరు బిడ్డర్లు తిరిగి చెల్లించబడే డిపాజిట్ (EMD) ను **ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, ఎం.వి.పి. కోలనీ బ్రాంచి, విశాఖపట్నం** పేరున చెల్లించుబడేలా పే-ఆర్డర్/ డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించాలి. కృతార్థులైన బిడ్డర్ల విషయంలో సదరు డిపాజిట్ సర్దుబాటు చేయబడును. అధీకృత అధికారిచే వేలం అమ్మకం నిర్వహించబడును. కాగోరు బిడ్డర్లు పే-ఆర్డర్ / డిమాండ్ డ్రాఫ్ట్‌తో సహా బిడ్‌ను సీల్డ్ కవర్‌లో ఉంచి తేది 16-07-2024 సాయంత్రం 6-00 గంటలలోగా పైన తెలిపిన బ్రాంచి నందు దాఖలు చేయాలి.
2. బయానా కోసం పే-ఆర్డర్/ డి.డి. లేకుండా దాఖలు చేసిన బిడ్ ఖచ్చితంగా తిరస్కరించబడును.
3. ఎట్టి కారణాలు తెలియజేయకుండా ఏదైనా లేదా అన్ని బిడ్లను / ఆఫర్లను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు లేదా వేలం అమ్మకమును వాయిదా వేయుటకు / పోస్ట్‌పోన్ చేయుటకు, / రద్దు చేయుటకు అధీకృత అధికారికి హక్కు కలదు. బిడ్లు తిరస్కరించబడితే, ప్రైవేటు ఒప్పందం ద్వారా ఆస్తుల అమ్మకం కోసం ఏ టెండర్దారులతోనైనా లేదా కాగోరు బిడ్డర్లతో నైనా లేదా ఇతర పార్టీలతోనైనా అధీకృత అధికారి సంప్రదింపులు జరిపి ఆస్తిని అమ్మకము చేయవచ్చును.
4. అత్యధిక బిడ్డరుకు ఆస్తిని విక్రయించబడును.
5. పైన పేర్కొన్న ఆస్తిని తెలియజేసిన రిజర్వు ధర కంటే తక్కువగా విక్రయించబడదు.
6. బిడ్/ ఆఫరు అధీకృత అధికారిచే అంగీకరించబడితే, బిడ్‌లో అత్యధిక అమ్మకం ధర ఆఫర్ చేసిన కృతార్థుడైన బిడ్డరు అమ్మకం ధరలో బిడ్ మొత్తం (బయానాతో సహా) లో 25% మొత్తమును వెంటనే అదే రోజున అధీకృత అధికారికి చెల్లించాలి. ఆ విధంగా చేయడంలో విఫలమైతే, బయానా మొత్తం తిరిగి చెల్లించబడదు. మరియు ఆస్తి తిరిగి విక్రయించబడును.
7. కృతార్థుడైన బిడ్డరు అమ్మకం నిర్ధారించబడిన 15వ రోజులోగా లేదా అంతకంటే ముందుగా బిడ్ మొత్తంలో మిగిలిన 75% మొత్తమును పే-ఆర్డర్/డిడి/ క్యాష్ రూపములో **ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, ఎం.వి.పి. కోలనీ బ్రాంచి, విశాఖపట్నంలో** చెల్లించవచ్చును. బిడ్ మొత్తంలోని మిగిలిన 75% మొత్తం నిర్ధీత గడువులోగా అనగా అమ్మకం నిర్ధారించబడిన తేది నుండి 15 రోజులలోగా చెల్లింపు జరపకపోతే డిపాజిట్ మొత్తం (బయానాతో సహా బిడ్ మొత్తంలో 25%) తిరిగి చెల్లించబడదు. మరియు ఆస్తి తిరిగి విక్రయించబడును. మరియు డిఫాల్ట్ అయిన కొనుగోలుదారు తదుపరి విక్రయించబడే ఆస్తి లేదా అందులోని ఏ భాగం పైన నైనా అన్ని క్లెయిమ్‌లు కోల్పోతారు.
8. బ్యాంక్‌చే అమ్మకం నిర్ధారించబడిన మీదట మరియు చెల్లింపు నిబంధనలు పాటించినట్లయితే, అమ్మకం అధికారాలు వినియోగించుకునే అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ చట్టం 2002 క్రింద గల నియమాల ప్రకారం కొనుగోలుదారుని పేరున అమ్మకపు సర్టిఫికెట్ జారీ చేస్తారు.
9. ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ ఆ విధంగానే మరియు ఉన్నవి ఉన్నట్లుగానే" స్థితిలో మరియు సెక్యూరిటైజేషన్ చట్టం 2002లో నిర్దేశించిన నిబంధనలకు లోబడి విక్రయించబడును.
10. ఆసక్తిగల పార్టీలు/ బిడ్డర్లు వేలం అమ్మకం కోసం ఉంచబడిన ఆస్తిని బ్రాంచి పనిచేయుబడిన సమయంలో బ్రాంచి మేనేజర్ అనుమతితో తనిఖీ చేసుకోవచ్చును. వాటి కోసం వారు బ్రాంచి మేనేజర్ **ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, ఎం.వి.పి. కోలనీ బ్రాంచి, విశాఖపట్నం** వారిని సంప్రదించవచ్చును.
11. కృతార్థుడైన బిడ్డరు వర్తించు విధంగా / చెల్లించతగు కన్వేయన్స్, రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీ, పన్నులు, చట్టబద్ధమైన బకాయిలు మొ॥ చెల్లించబడు అన్ని చార్జీలను ప్రత్యేకంగా బిడ్డరు భరించవలెను.
12. బ్యాంక్ నిర్ధారణకు లోబడి అమ్మకం/ వేలం ఉంటుంది.
13. వేలం వేయబడిన ఆస్తికి సంబంధించి ఏదైనా చార్జ్, లీన్, తాకట్టు, రుణభారాలు, ఆస్తిపన్ను లేదా ప్రభుత్వానికి లేదా ఏ సంస్థకైనా ఏదైనా ఇతర బకాయిలు ఉంటే అధీకృత అధికారి బాధ్యత వహించరు.
14. వారి బకాయిలు పూర్తిగా తిరిగి చెల్లించనట్లయితే, పైన తెలిపిన తేదీన వేలం అమ్మకం నిర్వహిస్తూ పైన పేర్కొన్న రుణంనకు సంబంధించిన రుణగ్రహీత / గ్యారంటారుకు ఇది నోటీసుగా కూడా ఉంటుంది.
15. వేలం ప్రక్రియ ద్వారా ఆస్తుల అమ్మకం సంపూర్ణం కాకపోతే SARFAESI చట్టంలోని నిబంధనల ప్రకారం ప్రైవేట్ ఒప్పందం ద్వారా బ్యాంక్ అమ్మకమునకు వర్తింపజేస్తుంది.
16. అధీకృత అధికారిచే తెలియజేయబడిన వివరాలు అతని పరిజ్ఞానం మేరకు మరియు రికార్డుల ప్రకారం ఉన్నాయి. ఏదైనా పొరబాటు, తప్పుడు స్టేట్‌మెంట్ లేదా వదిలివేసిన దానికి సంబంధించి అతను బాధ్యత వహించడు.
17. సెక్యూర్డ్ క్రెడిటార్స్‌కు అయిన అన్ని వ్యయాలు, చార్జీలు మరియు ఖర్చులతో సహా అన్ని బకాయిలు ఒకవేళ ఆస్తి అమ్మకమునకు నిర్ణయించిన తేదీలోగా ఏ సమయంలోనైనా పై పేరుగల రుణగ్రహీత / సహా రుణగ్రహీత / లీగల్ హెయిర్స్ తీర్చినట్లయితే అపుడు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తి విక్రయించబడదు. మరియు కాగోరు బిడ్డర్ల నుండి స్వీకరించబడే అన్ని బిడ్లు ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ పక్షాన ఎటువంటి బాధ్యత / క్లెయిమ్ లేకుండా వారికి వాపసు ఇవ్వబడును.
18. ఆఫర్ ఫారంతో సహా కాగోరు బిడ్డరు ఆదాయ పన్ను శాఖచే జారీ చేయబడిన PAN కార్డ్ కాపీ మరియు అతని / ఆమె గుర్తింపు రుజువు మరియు నివాస రుజువు అంటే ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్, ఎలక్షన్ కమిషన్ కార్డ్, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ మొ॥ వాటి కాపీ కూడా జతచేయాలి.

తేది : 13-06-2024, విశాఖపట్నం **అధీకృత అధికారి, ఎం.వి.పి. కోలనీ బ్రాంచి**